శనివారం

02-09-2023

విజయవాడ ప్రచురణ

సంపుటి : 72, సంచిక : 73

పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

గాబన్‌లో సైనిక తిరుగుబాటు

మధ్య ఆఫ్రికా దేశమైన గాబన్‌లో సైనిక తిరుగుబాటు జరిగింది. దీంతో 55 ఏళ్ల కుటుంబ పాలనకు తెరపడింది. తాజా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించినప్పటికీ అధ్యక్షుడు అలీ బాంగోకు పదవి దక్కలేదు. అధికారాన్ని దేశాన్ని సైన్యం హస్తగతం చేసుకుంది. అధ్యక్షుడిని గృహనిర్బంధంలో ఉంచింది

2 లో

ఉమ్మడి పోటీ

- సీట్ల పంపిణీపై 14 మందితో సమన్వయ కమిటీ
- సెప్టెంబరు 30 నాటికి పూర్తి
- జమిలీ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ముప్పు
- ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు
- మోదీ సర్కారును గద్దె దించడమే లక్ష్యం
- ఇండియా' కూటమి తీర్మానం

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికలలో 'సాధ్యమైనంత వరకు' కలిసి పోటీ చేయాలని 'ఇండియా' కూటమిలోని పార్టీలు శుక్రవారం తీర్మానించాయి. కూటమి మూడో సమావేశం ముంబైలో రెండవ రోజు శుక్రవారం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. 28 పార్టీల అగ్రనేతలు హాజరైన ఈ కీలక భేటీలో వచ్చే ఎన్నికల నాటికి ఉమ్మడి పోరుకు చేయవలసిన సన్నద్ధతపై చర్చించారు. ముందస్తు ఎన్నికల ఊహాగానాలు, 'ఒక దేశం-ఒకే ఎన్నికలు' అనే అవకాశాలను అన్వేషించడానికి మోదీ సర్కారు కమిటీని ఏర్పాటు చేయడం వంటి ఊహాగానాల నడుమ ప్రతిపక్ష నాయకులు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 14 మంది సభ్యులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఇది కూటమికి సంబంధించిన అత్యున్నత నిర్ణయాధికార సంస్థగా వ్యవహరిస్తూ సీట్ల పంపకంపై కసరత్తు ప్రారంభించనుంది. ఇక్కడ జరిగిన సమావేశంలో ఆమోదించిన తీర్మానంలో రాబోయే లోక్‌సభ ఎన్నికలలో 'సాధ్యమైనంత వరకు' కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు 'ఇండియా' కూటమి తెలిపింది. వివిధ రాష్ట్రాల్లో సీట్ల భాగస్వామ్య ఏర్పాట్లను తక్షణమే ప్రారంభించి, ఇచ్చిపుచ్చుకునే సహకార స్ఫూర్తితో వీలైనంత త్వరగా ముగిస్తామని పేర్కొంది. మేము, 'ఇండియా కూటమి పార్టీలు, ప్రజల ఆందోళన, ముఖ్యమైన సమస్యలపై దేశంలోని వివిధ ప్రాంతాలలో వీలైనంత త్వరగా బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించుకున్నాం' అని తీర్మానం పేర్కొంది. 'వివిధ భాషల్లో 'జుడేగా భారత్, జీతేగా ఇండియా' అనే ఇతివృత్తంతో తమ కమ్యూనికేషన్లు, మీడియా వ్యూహాలు, ప్రచారాలను సమన్వయం చేసుకోవాలని నిర్ణయించినట్లు కూటమి పార్టీలు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. సెప్టెంబరు 30 నాటికి సీట్ల పంపకం ఖరారు కానుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇదిలాఉండగా, ఈ 'నిరంకుశ ప్రభుత్వ నిష్క్రమణ ప్రారంభమైంది' అని

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే అన్నారు. ఈ చర్చల్లో ఖడ్గే, కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, నేషనల్ కాన్ఫరెన్స్ నేతలు ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఐ (ఎంఎల్) నేత దీపాంకర్ భట్టాచార్య, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, రాజ్యసభలో స్వతంత్ర ఎంపీ కపిల్ సిబల్, ఆర్ఎల్‌డీ నేత జయంత్ చౌదరి ఉన్నారు. సమావేశానికి ముందు 'ఇండియా' కూటమి నాయకులందరూ గ్రూప్ ఫొటో దిగారు. చంద్రయాన్-3 మిషన్‌ను ఇస్రో విజయవంతంగా ప్రయోగించడాన్ని ప్రశంసిస్తూ తీర్మానాన్ని ఆమోదించారు. అంతరిక్ష సంస్థ సామర్థ్యాలు, సామర్థ్యాలను నిర్మించడానికి, విస్తరించడానికి, లోతుగా అధ్యయనం చేయడానికి ఆరు దశాబ్దాలు పట్టిందని నొక్కి చెప్పారు.

14 మంది సభ్యుల కమిటీ ఇదే...

28 ప్రతిపక్ష పార్టీల 'ఇండియా' కూటమి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఢీకొట్టేందుకు ఒక ముఖ్యమైన ముందడుగు వేసింది. ముంబై సమావేశం తర్వాత 14 మందితో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ నాయకుడు కేసీ వేణుగోపాల్, ఎన్‌సీపీ నేత శరద్ పవార్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆర్‌జేడీ నాయకుడు తేజస్వి యాదవ్, టీఎంసీ నాయకుడు అభిషేక్ బెనర్జీ, శివసేనకు చెందిన సంజయ్ రౌత్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఆప్ నాయకుడు రాఘవ్ చద్దా, సమాజ్‌వాది పార్టీ నాయకుడు జావేద్ అలీఖాన్, జేడీ(యూ)కు చెందిన లాలన్ సింగ్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా, పీడీపీ నాయకురాలు మెహబూబా ముఫ్తీ ఉన్నారు. కాగా, సీపీఎం నుంచి ఎవరనేది ఖరారు కావలసి

- మిగతా 2 లో

బీజేపీ, మోదీ గుండెల్లో రైళ్లు: రాజా

ముంబై : భారత జాతీయ అభివృద్ధి సమ్మిళిత (ఇండియా) కూటమిని చూసి బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. 'ఇండియా' బలాన్ని చూసి బీజేపీ వణికిపోతోందని వ్యాఖ్యానించారు. రాజా శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ధైర్యంగా ఎన్నికలను ఎదుర్కొనే విశ్వాసం అధికార పార్టీకి లేదన్నారు. 'ఒక విషయం చాలా స్పష్టంగా ఉంది. బీజేపీ, మోదీ నిరాశలో ఉన్నారు. 'ఇండియా' కూటమిని చూసి

- మిగతా 2 లో

ఆర్-5 జోన్‌పై జగన్ సర్కార్‌కు

చుక్కెదురు

హైకోర్టు తీర్పుపై 'స్టే'కు సుప్రీం నిరాకరణ

తదుపరి విచారణ నవంబరుకు వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఆర్-5 జోన్‌పై సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. రాజధాని ప్రాంతంలో ఇళ్ళ స్థలాల కేటాయింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్-5 జోన్ ఏర్పాటు చేయడం, దానిలో గృహ నిర్మాణం చేపట్టేందుకు ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయడం తెలిసిందే. దీనిపై రైతులు హైకోర్టును ఆశ్రయించగా... గృహ నిర్మాణాలను నిలిపివేస్తూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా... శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం ఈ అంశంపై విచారణ జరిపింది. ఈ క్రమంలో ఆర్-5 జోన్‌పై హైకోర్టు జారీచేసిన స్టే ఉత్తర్వులు ఇచ్చేందుకు ఉన్నతన్యాయస్థానం నిరాకరించించింది. ఆర్-5 జోన్ వ్యవహారానికి, రాజధాని అంశానికి సంబంధం ఉందా ? అని జడ్జి ప్రశ్నించారు. దీనిపై ఏపీ ప్రభుత్వ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాజెక్టు చేపట్టిందని, పట్టాలు పంపిణీ చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు సంకల్పించగా, హైకోర్టు స్టే ఇచ్చిందని కోర్టుకి తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ... జస్టిస్ జోసెఫ్ ఉత్తర్వుల తర్వాతే హైకోర్టు విచారణ జరిపిందని,

- మిగతా 2 లో

సీమ ప్రాజెక్టులను

వెంటనే పూర్తి చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

నంద్యాలలో బస్సుయాత్రకు ఘన స్వాగతం

పెండింగ్ ప్రాజెక్టులు కూడా పూర్తి చేయలేని అసమర్థ ప్రభుత్వం జగన్ ప్రభుత్వమని, రాయలసీమ జిల్లాల్లోని ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని రక్షించండి... దేశాన్ని కాపాడండి అనే నినాదంతో ఆగస్టు 17 న విశాఖలో సీపీఐ ప్రారంభించిన బస్సు యాత్ర శుక్రవారం నంద్యాలకు చేరుకుంది.

8లో

జమిలీ ఎన్నికలపై కమిటీ

రామ్‌నాథ్ కోవింద్‌కు బాధ్యతలు

న్యూఢిల్లీ: దేశంలో జరగబోయేది జమిలీ ఎన్నికలా లేక ముందస్తు ఎన్నికలా అన్న చర్చ సర్వత్రా సాగుతోంది. 'ఒక దేశం, ఒకే ఎన్నిక' అమలు కోసం కేంద్రప్రభుత్వం చర్యలు వేగం పుంజుకోవడం, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయడంతో ముందస్తు ఎన్నికలకు సంకేతాలు

- మిగతా 2 లో

నేడు నింగిలోకి 'ఆదిత్య-ఎల్1'

విశాలాంధ్ర-సూళ్లూరుపేట : సూర్యుడిపై అధ్యయనానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తొలిసారిగా ఆదిత్య- ఎల్1 ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఈ ప్రయోగం ద్వారా దాదాపు 1.5 మిలియన్ కి.మీ. దూరంలో ఉన్న సూర్యుడి ఎల్1 కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపి.. నిరంతరం పరిశీలించనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా శ్రీహరికోటలో సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈ ప్రతిష్ఠాత్మక ప్రయోగాన్ని నిర్వహిస్తోంది. పీఎస్ఎల్‌వీ-సీ57 వాహక నౌక ద్వారా శనివారం (సెప్టెంబరు 2న) ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని సూర్యుడి కక్ష్యలోకి ఇస్రో పంపుతోంది. ఇందుకు సంబంధించి 24 గంటల కౌంట్‌డౌన్ ప్రక్రియ శుక్రవారం ఉదయం 11.50 గంటలకు ప్రారంభమైంది. ఇది నిరంతరాయంగా 24 గంటల పాటు కొనసాగి.. శనివారం ఉదయం రెండో ప్రయోగ కేంద్రం నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఆదిత్య ఎల్1 మిషన్‌లో 7 పేలోడ్స్ ఉంటాయి. ఇవి

- మిగతా 2 లో

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో

ఏపీ ఎంఎస్పీ చట్టం

- ప్రత్యామ్నాయ పంటల సాగుకు చర్యలు
- రైతులకు అవగాహన కార్యక్రమాలు
- దాణా, పశుగ్రాసం సరఫరాకు కసరత్తు
- వ్యవసాయ సమీక్షలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఏపీ ఎంఎస్పీ చట్టాన్ని ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. రైతులకు నిర్ణయించిన కనీస మద్దతు ధర ఇవ్వకుంటే ఈ చట్టం ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. పంటలకు కనీస మద్దతు ధరల అమలు విషయంలో ఆర్బీకేలది

- మిగతా 2 లో

ఇదీ లోకం!

టీచర్ల అవస్థలు

- వేతనాల కోసం పడిగాపులు
- రుణాల చెల్లింపులో ఇక్కట్లు
- బడ్జెట్ లోటే కారణం?
- అప్పు కోసం సర్కార్ వేట

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయుల ఖాతాల్లో ఒకటో తేదీన వేతనాలు వేయలేక ప్రభుత్వం అష్టకష్టాలు పడుతోంది. వేతనాల కోసం ఉపాధ్యాయులు ప్రతినెలా ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రైవేట్‌రంగ ఉద్యోగుల కంటే ప్రభుత్వ ఉద్యోగులు నెలలో ఆలస్యంగా వేతనాలు తీసుకోవడం ఆక్షేపణీయంగా మారింది. ఈ ఏడాదిలో నాలుగైదు నెలలు మాత్రమే ఉపాధ్యాయులకు వేతనాలు ఒకటో తేదీన ఇచ్చింది. ఇప్పుడు మళ్లీ జాప్యం చేస్తోంది. ఈనెల 1వ తేదీన ఉపాధ్యాయుల ఖాతాల్లో వేతనాలు జమ కాలేదు. దీనివల్ల ఉపాధ్యాయులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం దగ్గర బడ్జెట్ లేకపోవడం, కేడర్ స్ట్రెంత్ ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వేతనాల కోసం రిజర్వు బ్యాంకు నుంచి రూ.5వేల కోట్ల అప్పు తీసుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దీనికోసం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఆర్థికశాఖ ఉన్నతాధికారులు దిల్లీ కేంద్రంగా మకాం వేసి... అప్పుకోసం ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కొత్త

- మిగతా 2 లో

పర్యావరణ నిబంధనలపై లాబీయింగ్

మరో దిగ్గజ కంపెనీ వేదాంత అక్రమాలు గుట్టురట్టు

ఓసీసీఆర్‌పీ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: మరో దిగ్గజ కంపెనీ వేదాంత గ్రూప్ అక్రమాలను ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఓసీసీఆర్‌పీ) శుక్రవారం బట్టబయలు చేసింది. కరోనా మహమ్మారి సమయంలో కీలక పర్యావరణ నిబంధనలను బలహీనపరిచేలా వేదాంత రహస్య లాబీయింగ్ నిర్వహించినట్లు ఓసీసీఆర్‌పీ నివేదిక వెల్లడించింది. ప్రజల నుండి అభిప్రాయ సేకరణ చేయకుండానే మోదీ ప్రభుత్వం అక్రమ పద్ధతుల్లో ఈ మార్పులను ఆమోదించిందని తెలిపింది. ఓ సందర్భంలో నూతన పర్యావరణ అనుమతులు లేకుండా మైనింగ్ కంపెనీలు 50 శాతం వరకు ఉత్పత్తి చేయగలవని వేదాంత కంపెనీ వాదించినట్లు నివేదిక పేర్కొంది. వేదాంతకు చెందిన ఆయిల్ కంపెనీ కెయిర్న్ ఇండియా ప్రభుత్వ వేలంలో గెలిచిన చమురు బ్లాక్‌లలో డ్రిల్లింగ్ కోసం బహిరంగ విచారణ లేకుండా లాబీయింగ్ నిర్వహించినట్లు తెలిపింది. అప్పటి నుండి స్థానికంగా పెద్దఎత్తున వ్యతిరేకత ఉన్నప్పటికీ రాజస్తాన్‌లో కెయిర్న్ సంస్థకు ఆరు వివాదాస్పద చమురు బ్లాక్‌లను కట్టబెట్టినట్లు వెల్లడించింది.

లాభాపేక్ష లేని సంస్థ అయిన ఓసీసీఆర్‌పీ గురువారం అదానీ గ్రూపు అక్రమాలను వెలికితీసిన సంగతి తెలిసిందే. అదానీ గ్రూప్ తన కంపెనీల స్టాక్‌ధరలను తారుమారు చేసి, వాటి ఆస్తుల విలువలను అడ్డగోలుగా పెంచేందుకు అక్రమాలకు పాల్పడిందన్న ఆధారాలను వెల్లడించింది.

గాబన్‌లో సైనిక తిరుగుబాటు

- ముగిసిన 55 ఏళ్ల కుటుంబ పాలన
- స్వాగతించిన ప్రజలు

లిబ్రెవిల్లె: మధ్య ఆఫ్రికా దేశమైన గాబన్‌లో సైనిక తిరుగుబాటు జరిగింది. దీంతో 55 ఏళ్ల కుటుంబ పాలనకు తెరపడింది. తాజా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించినప్పటికీ అధ్యక్షుడు అలీ బాంగోకు పదవి దక్కలేదు. అధికారాన్ని దేశాన్ని సైన్యం హస్తగతం చేసుకుంది. అధ్యక్షుడిని గృహనిర్బంధంలో ఉంచింది. ఎన్నికల ఫలితాలను రద్దు చేసింది. దీంతో తనకు మద్దతుగా నినాదాలు, ఆందోళనలు చేయాలని దేశ ప్రజలకు అధ్యక్షుడు ఓ వీడియో సందేశమిచ్చారు. అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కానీ అందుకు భిన్నపరిస్థితులు దేశంలో కనిపించాయి. రాజధాని లిబ్రెవిల్లెలో ప్రజలు రోడ్లపైకొచ్చి జాతీయ పతాకాలు ప్రదర్శించారు. జాతీయ గీతం ఆలపిస్తూ తిరుగుబాటుదారులకు మద్దతు పలికారు. దేశ వనరులను కొల్లగొడుతూ బాంగో కుటుంబం సంపద అమాంతం పెంచుకుందని దుయ్యబట్టారు. తిరుగుబాటు చేసినందుకు సైన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. మా నిరీక్షణ ముగిసిందంటూ వేడుక చేసుకున్నారు. సైనిక తిరుగుబాటు కారణంగా దేశంలో పార్లమెంట్, రాజ్యాంగ కోర్టు, ఆర్థిక, సామాజిక, పర్యావరణ మండలి, గాబనీస్ సెంటర్ ఫర్ ఎలక్షన్స్‌లతో సహా అన్ని ప్రభుత్వ సంస్థలు రద్దయ్యాయి. అన్ని సరిహద్దులనూ సైన్యం మూసివేసింది. బాంగో తిరిగి ఎన్నికయ్యారని గాబన్ ఎన్నికల సంఘం ప్రకటించిన వెంటనే సైనిక తిరుగుబాటు జరిగినట్లు తెలుస్తోంది. అధ్యక్ష ఎన్నిక విశ్వసనీయమైనది కాదన్నది సైన్యాధికారుల వాదన. బాంగో (64) 2009 నుంచి అధికారంలో ఉన్నారు. అంతకుముందు 41ఏళ్లు ఆయన తండ్రి పరిపాలన సాగింది. బాంగో కుటుంబ పాలనపై చాలా ఏళ్లుగా ప్రజల్లో అసంతృప్తి, అసహనం పెరిగాయి. 2019లోనూ వేరొక వర్గం ద్వారా సైనిక తిరుగుబాటుకు విఫలయత్నం జరిగింది. అయితే తాజా పరిస్థితులకు బాంగో అసమర్థ పాలనే కారణమని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. బాంగో నిర్లక్ష్య వైఖరి, అనాలోచిత నిర్ణయాలు దేశాన్ని గందరగోళంలోకి నెట్టివేసినట్లు సైనికుల అధికార ప్రతినిధి అన్నారు. ప్రభుత్వ సంస్థలను మోసం చేసిన నేరం కింద అధ్యక్షుడి సన్నిహితులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. తాజా పరిణామాలతో గాబన్ ప్రజల కష్టాలు మరింత పెరుగుతాయని విదేశీ నాయకులు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తంచేశారు.

ఫ్రాన్స్,ఈయూ ఖండన: సైనిక తిరుగుబాటును ఫ్రాన్స్, యూరోపియన్ యూనియన్ ఖండించాయి. ఎన్నికల ఫలితాలను గౌరవించాలని ఫ్రాన్స్ ప్రభుత్వ అధికార ప్రతినిధి ఓలివర్ వెరన్ పేర్కొన్నారు. గాబన్‌లో ఫ్రాన్స్‌కు ఆర్థిక, దౌత్య, సైనికపరంగా మంచి సంబంధాలు ఉన్నాయి.

సైనిక తిరుగుబాటు ఆ ప్రాంతాన్ని అస్థిరపరుస్తుందని యూరోపియన్ యూనియన్ పేర్కొంది. శాంతియుతంగా చర్యలు జరపడం ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ అన్నారు. గాబన్ దేశం, ప్రజల ప్రయోజనాల దృష్ట్యా చర్యలు ఉండాలని సూచించారు.

సైనిక పాలన సమాధానం కాబోదు: గుటెర్రస్

ఐరాస: అనేక దేశాల్లో పాలనపరమైన సవాళ్లు లోతుగా నాటుకు పోయి ఉండవచ్చుగానీ వాటికి సైనిక ప్రభుత్వం ఏర్పాటు సమాధానం కాబోదని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ నొక్కిచెప్పారు. గతంలో చాద్ గునియా, సూడాన్, మాలీలో తిరుగుబాట్లు జరిగాయి.

గతేడాది బుర్కినా ఫాసోలో, తాజాగా నైగర్, గాబన్ దేశాల్లో తిరుగుబాట్లు జరగడంపై గుటెర్రస్ ఆందోళన వ్యక్తంచేశారు. దేశంలో చట్టబద్ధ ప్రజాస్వామిక పాలన ఉండటం ఎంతో ముఖ్యమని అన్నారు. పాలనా సవాళ్లకు తిరుగుబాట్లతో పరిష్కారం లభించబోదన్నారు. ఇలాంటి వాటి వల్ల సమస్యలు, సంక్షోభాలు మరింత తీవ్రతరం అవుతాయని గుటెర్రస్ తెలిపారు. నమ్మకంతో కుదుకున్న ప్రజాస్వామిక వ్యవస్థల ఏర్పాటు, రూల్ ఆఫ్ లా ఉండటం ఎంతో అవసరమని దేశాలకు పిలుపునిచ్చారు.

ఆఫ్రికాలో శాంతి, సుస్థిరత నెలకొనాలంటే అభివృద్ధి జరగాలని ఆయన సూచించారు. గుటెర్రస్ త్వరలోనే కెన్యాలో జరగబోయే ఆఫ్రికా వాతావరణ సదస్సులో పాల్గొనున్నారు. ఆపై ఇండోనేసియాలో 13వ ఏషియన్-ఐరాస సదస్సుకు, భారత్‌లో జీ20, క్యూబాలో జీ77 సదస్సులకు హాజరవుతారు. చైనాలోనూ పర్యటించనున్నారు. నాలుగు శిఖరాగ్ర సదస్సుల ద్వారా ప్రపంచ నేతలతో కీలకాంశాలపై చర్చించాలని భావిస్తున్నట్లు గుటెర్రస్ వెల్లడించారు. ఐరాస జనరల్ అసెంబ్లీ ప్రారంభోత్సవానికి ప్రపంచం ఏకం కాబోతోందని ఆయనన్నారు.

ట్రంప్ విచారణ 6కు వాయిదా

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో నెగ్గాలన్న పట్టుదలగా ఉన్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై తాజాగా నాల్గో క్రిమినల్ కేసు నమోదైంది. 2020 అధ్యక్ష ఎన్నికలప్పుడు జార్జియాలో ఫలితాలను ప్రభావితం చేశారన్న ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. ఈ కేసు విచారణలో భాగంగా తాను ఏ తప్పు చేయలేదని ఫుల్టన్ కౌంటీ సుపీరియర్ కోర్టులో ట్రంప్ వివరణ ఇచ్చారు. తాను నిర్దోషినంటూ అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ కేసులో ట్రంప్‌కు మరో 18 మంది సహ నిందితులు ఉన్నారు. కేసును విచారించిన జడ్జి స్కాట్ మెక్‌ఫీ... మిగతా నిందితులతో పాటు ట్రంప్‌పై ఆరోపణలను విచారిస్తామంటూ కేసును సెప్టెంబరు 6వ తేదీకి వాయిదా వేశారు. తదుపరి విచారణకు ట్రంప్ హాజరు కారని ఆయన తరఫున న్యాయవాదులు తెలిపారు. వేగవంత విచారణను కోరినట్లు తెలిపారు. మిగతా నిందితులతో కలిపి కాకుండా ట్రంప్‌ను విడిగా విచారించాలని న్యాయస్థానానికి విన్నవించామన్నారు. అయితే గతవారం ట్రంప్ జార్జియా, అట్లాంటాలోని ఫుల్టన్ కౌంటీ జైలులో లొంగిపోయారు. దీంతో మగ్‌షాట్ తీయించుకున్న తొలి మాజీ అధ్యక్షుడిగా అమెరికా చరిత్రలో నిలిపోనున్నారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లిక్ పార్టీ తరఫున ప్రధాన అభ్యర్థిగా ఉన్న ట్రంప్‌పై జార్జియా వ్యవహారంతో కలిపి మొత్తం నాలుగు క్రిమినల్ కేసులు నడుస్తున్నాయి. అయితే తనపై కేసులు రాజకీయ ప్రేరేపితమని, తనను శ్వేతసౌధానికి దూరంగా ఉంచే కుట్రలో భాగమని ట్రంప్ ఇంతకుముందే వ్యాఖ్యానించడం విదితమే.

కిరణ్మయికి ఆత్మీయ సత్కారం

సీపీఐకి రూ.50 వేల విరాళం

విశాలాంధ్ర-విశాఖ: ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్‌లో 35 సంవత్సరాలు వివిధ హోదాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి సీనియర్ బ్రాంచ్ మేనేజర్‌గా ఉద్యోగ విరమణ చేసిన జె.కిరణ్మయిని శుక్రవారం సీపీఐ విశాఖ జిల్లా కార్యాలయంలో పార్టీ నేతలు, ముఖ్యులు ఆత్మీయంగా సత్కరించారు. కిరణ్మయి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి సతీమణి. ఈ సందర్భంగా సీపీఐ ఉమ్మడి విశాఖ జిల్లా సమితికి 50 వేల రూపాయలు విరాళంగా ఆమె ఇచ్చారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కార్యదర్శులకు ఈ విరాళం అందజేశారు. కిరణ్మయి విధి నిర్వహణలో చేసిన సేవలను విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు చలసాని రాఘవేంద్రరావు, మూడు జిల్లాల కార్యదర్శులు ఎం.పైడిరాజు, బి.వెంకటరమణ, పి.సత్యనారాయణ అభినందిం చారు. ఈ కార్యక్రమంలో బి.వెంకటరావు, జీఎస్‌జే అచ్యుతరావు, డి.మార్కండేయులు, జి.కాసులరెడ్డి, కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎ.విమల తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు భరోసా

1,46,324 మందికి రూ.109 కోట్లు

లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా పంట సాగుదారు హక్కు పత్రాలు (సీసీఆర్సీలు) పొందిన వారిలో అర్హులైన 1,46,324 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులు, దేవాదాయ భూముల సాగుదారులకు వైఎస్సార్ రైతు భరోసా సాయంగా రూ.109.01 కోట్లు, పంట నష్టపోయిన 11,373 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.11.01 కోట్లతో కలిపి మొత్తం రూ.120.75 కోట్ల ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా కౌలు రైతులకు మన ప్రభుత్వం తోడుగా నిలబడుతుందన్నారు. కౌలు రైతుల కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి, రైతులెవరికీ కూడా నష్టం లేకుండా 11 నెలల పాటు సీసీఆర్‌సీ కార్డులను గ్రామ సచివాలయంలోనే అందుబాటులోకి తీసుకొచ్చాం. సీసీఆర్సీ కార్డు కౌలు రైతులకిచ్చిన పక్షంలో రైతులకు జరగాల్సిన మేలు జరగకుండా పోదు. వాళ్లకు కూడా రైతు భరోసాతో సహా అన్నీ వస్తాయి. సీసీఆర్సీ కార్డు పొందిన కౌలు రైతులకూ రైతు భరోసాతో పాటు మిగిలినవీ వస్తాయని, ఒక చట్టం తీసుకువచ్చాం. తద్వారా కౌలు రైతులకు, రైతులకు మధ్య అవగాహనా ఒప్పందాలు కుదిర్చి, రైతులు ఏమాత్రం నష్టపోకుండా కౌలు రైతులకు మేలు చేసే కార్యక్రమం చేస్తున్నామన్నారు. అలాగే పంట నష్టపోయిన అదే సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చే పరిస్థితి మన ప్రభుత్వంలోనే చేసి చూపించామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కాకాని గోవర్ధన రెడ్డి, సీదిరి అప్పలరాజు, అగ్రి మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల అవస్థలు

(మొదటిపేజీ తరువాయి)

అప్పు పుడితేనే ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 5 వేల మంది ఉపాధ్యాయులున్నారు. వారికి వేతనాలు రానందున అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఉపాధ్యాయులపై రుణభారం

తీసుకున్న రుణాలకుగాను నెలసరి వాయిదాలు చెల్లించలేక ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి ఉపాధ్యాయుడికి గృహ, వ్యక్తిగత, విద్యా రుణాలుంటాయి. క్రెడిట్ కార్డుల వినియోగానికి కనీస సొమ్మును ప్రతినెలా చెల్లించాలి. వాటి కోసం నెలసరి వాయిదాల్ని ప్రతినెలా ప్రైవేట్ బ్యాంకులైతే 5వ తేదీలోగా జమ చేయాల్సి ఉంది. బయట ఫైనాన్స్ కంపెనీలైతే 2వ తేదీనే వాయిదాలకు క్లియరెన్స్ పంపుతాయి. ఆ సమయంలో ఉపాధ్యాయుల ఖాతాల్లో సొమ్ము నిల్వ లేకుంటే చెక్‌బౌన్స్ అవుతాయి. దీనివల్ల సంబంధిత బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు అదనంగా అపరాధ రుసుం వేస్తాయి. ఇలా పదేపదే జరగడం వల్ల భవిష్యత్‌లో వారికి మళ్లీ రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులుగానీ, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలుగానీ ఆసక్తి చూపవు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఆలస్యంగా వేతనాలు వేయడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. సకాలంలో వేతనాలు రానందున కొందరు ఇంటి అద్దె నుంచి చిన్నపాటి ఖర్చులను సైతం చెల్లించలేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఉపాధ్యాయుల వేతనాల్లో ఎలాంటి జాప్యం చేయవద్దంటూ చాలాసార్లు ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు విన్నవించినప్పటికీ స్పందన లేదు. కొంతకాలం ఒకటో తేదీన సక్రమంగా వేతనాలు వేసి, ఆ తర్వాత మళ్లీ జాప్యం చేయడం జగన్ సర్కారుకు ఆనవాయితీగా మారింది.

బదిలీలతో మూడు నెలల వేతనాలు పెండింగ్

ఉపాధ్యాయుల వేతనాల అంశంపై పాఠశాల విద్యాశాఖ, ఆర్థికశాఖల మధ్య సమన్వయ లోపం కన్పిస్తోంది. జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీలు, సర్దుబాటు ప్రక్రియ జరిగింది. దీని ప్రభావంతో అనేక పాఠశాలల్లో పోస్టులు రద్దుకాగా, చాలాచోట్ల పోస్టులు పెరిగాయి. దీంతో అవసరం లేని పాఠశాలల నుంచి అవసరమున్న పాఠశాలలకు ఉపాధ్యాయులను బదిలీ చేశారు. ఇలా పోస్టులు మారిన వివరాలు తెలుపుతూ కేడర్ స్ట్రెంత్‌ను సీఎఫ్ఎంఎస్‌కు, ట్రెజరీకి ఇవ్వాల్సి ఉంది. ఇది సకాలంలో పూర్తి చేయనందున బదిలీ అయిన 30 వేల మంది ఉపాధ్యాయులకు మూడు నెలల నుంచి వేతనాలు నిలిచిపోయాయి. వారికి ఆగస్టు వేతనం ఒక్కటే మంజూరు చేయనున్నారు. మిగిలిన రెండు నెలల వేతనాలపై మళ్లీ బిల్లులు సమర్పించాల్సి ఉంది.

కేడర్ స్ట్రెంత్ ప్రభావంతో అటు సాధారణ ఉపాధ్యాయులకు ఆగస్టు వేతనాలు ఆలస్యమయ్యే పరిస్థితులున్నాయి. ఈ నెల 2వ తేదీ నుంచి బిల్లులు అందజేసే అవకాశముంది. వాటికి అన్ని అనుమతులు పొంది, ప్రభుత్వం నుంచి ఖాతాల్లో వేతనాలు జమయ్యే సరికి ఈనెల 5వ తేదీ దాటవచ్చు. ఉపాధ్యాయుల వేతనాల చెల్లింపులో జాప్యంపై ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బదిలీ అయిన ఉపాధ్యాయులకు రావాల్సిన మూడు నెలల పెండింగ్ వేతనాలతోపాటు రెగ్యులర్ ఉపాధ్యాయుల వేతనాలను సకాలంలో ఖాతాల్లో జమ చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

నేడు నింగిలోకి 'ఆదిత్య-ఎల్1'

(మొదటిపేజీ తరువాయి)

సూర్యుడిపై వాతావరణ పరిస్థితులను అధ్యయనం చేస్తాయి. సూర్యుడిపై అధ్యయనానికి భారత్ పంపిస్తున్న తొలి శాటిలైట్ ఇదే. ప్రయోగానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ వెల్లడించారు.

చెంగాళమ్మ ఆలయంలో పూజలు

తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. చంద్రయాన్-3 విజయవంతం కావడంపై అమ్మవారికి పూజలు చేయడం తో పాటు శనివారం జరిగే ఆదిత్య- ఎల్1 మిషన్ ప్రయోగం కూడా విజయవంతం కావాలని అమ్మవారిని కోరుకుంటూ పూజలు చేసినట్లు సోమనాథ్ వెల్లడించారు. సూర్యుని పై అధ్యయనం చేయడం కోసం శనివారం ఉదయం 11.50 నిమిషాలకు పీఎస్ఎల్వీ- సి57 రాకెట్ ద్వారా ఆదిత్య - ఎల్1 మిషన్ ను ప్రయోగిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదిత్య మిషన్ ప్రయాణం 125 రోజులు ఉంటుందని, సూర్యునికి సమీపం లోకి చేరుకున్నాక అక్కడ జరిగే వాతావరణ మార్పులను, ఉష్ణోగ్రత మార్పుల పై పరిశోధనలు చేయడం జరుగుతుందని చెప్పారు. చంద్రయాన్-3 కి సంబంధించిన లాండర్, రోవర్ లు చంద్రునిపై సమర్థంగా పని చేస్తున్నాయని, చంద్రయాన్ విజయం లో శాస్త్రవేతలందరి కృషి ఉందని సోమనాథ్ వెల్లడించారు. అక్టోబర్ మొదటి లేదా రెండవ వారంలో మానవ రహిత గగన్ యాన్ రాకెట్ ప్రయోగం ఉంటుందని సోమనాథ్ ప్రకటించారు. అనంతరం జీఎస్ఎల్వీ ఎంకె-2 ద్వారా ఇన్‌శాట్-3డి రాకెట్ ప్రయోగం చేపడుతామని, తదుపరి మాసంలో ఎస్ఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగం చేస్తామని స్పష్టం చేశారు. సోమనాథ్‌తో పాటు షార్ డైరెక్టర్ రాజరాజన్ ఆర్ముగం, గ్రూప్ డైరెక్టర్ గోపినాథ్ కూడా ఉన్నారు. తొలుత ఇస్రో చైర్మన్‌కు ఆలయం వద్ద ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆళ్ళ శ్రీనివాసులు రెడ్డి స్వాగతం పలికారు.

ఉమ్మడి పోటీ

(మొదటిపేజీ తరువాయి)

ఉందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. వివిధ ప్రాంతాలు, సిద్ధాంతాలకు చెందిన నాయకులతో కూడిన ఈ సమన్వయ కమిటీ రానున్న ఎన్నికల కోసం ప్రతిపక్షాల ప్రయత్నాలను వ్యూహరచన చేయడంలో, సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.

'ఒక దేశం-ఒకే ఎన్నికలు' ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు

'ఒక దేశం-ఒకే ఎన్నికలు' సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ చర్యను ప్రతిపక్ష నాయకులు తప్పుపట్టారు. ఇది దేశ సమాఖ్య నిర్మాణానికి ముప్పు కలిగిస్తుందని విమర్శించారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ప్రియాంక కక్కర్ మాట్లాడుతూ 'ఇండియా' కూటమి కింద ప్రతిపక్ష పార్టీల ఐక్యతను చూసిన తరువాత అధికార పార్టీలో ఉన్న 'భయాందోళన'ను ఇది చూపిస్తుంది. 'మొదట వారు వంట గ్యాస్ ధరలను రూ.200 తగ్గించారు. ఇప్పుడు వారు చాలా భయాందోళనలకు గురయ్యారు. వారు రాజ్యాంగాన్ని సవరించాలని ఆలోచిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తాము గెలవలేమని గ్రహించారు. 'అలాగే, ఈ చర్య ద్రవ్యోల్బణం లేదా పెట్రోలు, డీజిల్ అధిక ధరల గురించి జాగ్రత్త చూసుకోగలదా?. మన రాజ్యాంగం చాలా చర్చల తర్వాత రూపొందించబడింది. వారు ఏమి చేయాలనుకుంటున్నారు. 'ఒక దేశం-ఒకే ఎన్నిక' అనేది సమాఖ్య వ్యవస్థకు ముప్పు కలిగిస్తుంది' అని పీటీఐకి చెప్పారు. శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ మాట్లాడుతూ దేశం ఇప్పటికే ఒకటిగా ఉందని, దానిని ఎవరూ ప్రశ్నించడం లేదన్నారు. 'మేము న్యాయమైన ఎన్నికలను డిమాండ్ చేస్తున్నాం. 'ఒక దేశం-ఒకే ఎన్నికలు' కాదు. 'ఒక దేశం ఒకే ఎన్నికలు' అనే ఈ ఎత్తుగడ నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలనే మా డిమాండ్ నుంచి దృష్టిని మరల్చడానికి తీసుకువస్తున్నారు' అని అన్నారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు 'ఒక దేశం-ఒకే ఎన్నికలు' సాధ్యాసాధ్యాలను అన్వేషించడానికి కమిటీకి నాయకత్వం వహించే బాధ్యతను అప్పగించిన తర్వాత ఈ వ్యాఖ్యలు వచ్చాయి.

బీజేపీ, మోదీ గుండెల్లో రైళ్లు: రాజా

(మొదటిపేజీ తరువాయి)

భయపడుతున్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్లమెంటు సమావేశాల ఉద్దేశం నెరవేరడం లేదు. పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటుపై చాలా ఊహాగానాలు ఉన్నాయి. సమావేశాల్లో చర్చించే అంశాలు, అజెండా గురించి ఎవరికీ తెలియదు. కానీ ఆ ఊహాగానాలను ఎదుర్కొంటాం. ఎందుకంటే బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్లమెంటు ఉద్దేశం నెరవేరడం లేదు' అని రాజా వ్యాఖ్యానించారు. 'ఒక దేశం-ఒకే ఎన్నిక' పై ఏకపక్షంగా ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లి అని పదేపదే చెప్పే మోదీ... ఇతర రాజకీయ పార్టీలతో చర్చించకుండా ఎలా నిర్ణయం తీసుకోగలరని రాజా నిలదీశారు. ఇదిలావుంటే ఈనెల 18 నుంచి 22 వరకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరుగనున్నాయి. వీటి గురించి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం ప్రకటించారు. అయితే అజెండాను మాత్రం ఆయన వెల్లడించలేదు.

ఏపీ ఎంఎస్పీ చట్టం

(మొదటిపేజీ తరువాయి)

కీలక పాత్రని స్పష్టంచేశారు. వర్షాల కొరత వల్ల రాష్ట్రంలో సాగు పరిస్థితులు, కంటెంజెన్సీ ప్రణాళికపై సీఎం జగన్ శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వాతావరణ పరిస్థితులను సీఎంకు అధికారులు వివరించారు. జూన్ నుంచి ఆగస్టు వరకు 419.6 మిమీల వర్షపాతం ఉండాలిగానీ 314.6 మిమీలే నమోదైనట్లు తెలిపారు. 25శాతం తక్కువగా వర్షాలు కురిశాయన్నారు. కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, ఎస్పీఎస్ నెల్లూరు, తిరుపతి, పల్నాడు, ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, వైయస్సార్, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వర్షాల కొరత తీవ్రంగా ఉందని అధికారులు తెలిపారు. అన్ని రిజర్వాయర్లలో నీటిసామర్థ్యం 1174.58 టీఎంసీలు కాగా ప్రస్తుతం 507.88 టీఎంసీల నీరు మాత్రమే ఉందన్నారు. క్లిష్టపరిస్థితుల్లోనూ తెలంగాణ రాష్ట్రం విద్యుత్ ఉత్పత్తి కోసం దిగువకు నీరు వదిలిపెడుతోందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వాతావరణ పరిస్థితులు, రిజర్వాయర్లలో నీటినిల్వను పరిగణనలోకి తీసుకుని కంటెంజెన్సీ ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. ఉలవలు, బొబ్బర్లు, మినుములు, పెసలు, కందులు, కొర్రలు, రాగి, జొన్న, మొక్కజొన్న, బాజ్రా, పొద్దుతిరుగుడు వంటి పంటల విత్తనాలు, 77వేల క్వింటాళ్లకుపైగా సిద్ధంగా ఉంచామని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని సీఎంకు వెల్లడించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇ-క్రాప్ నమోదుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అన్ని విధాలా రైతుల్ని ఆదుకునే చర్యలకు ఈ డేటా కీలకమన్నారు. పశువుల దాణా, గ్రాసాన్ని కూడా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అన్ని జిల్లాల్లో పంటల ప్రత్యామ్నాయ ప్రణాళికపై కలెక్టర్ల నేతృత్వంలో రైతుల సలహా మండళ్లతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం విద్యుత్ డిమాండు, పంపిణీలపైనా సీఎం సమీక్షించారు. గతేడాదితో పోలిస్తే గ్రిడ్ నుంచి డిమాండ్ 18 శాతం పెరిగిందని, విండ్ పవర్ గణనీయంగా తగ్గిందని, తడి బొగ్గు రావడంతో సామర్థ్యం మేరకు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో ఇబ్బందులు వస్తున్నాయని అధికారులు తెలిపారు. గతేడాది ఇదే సమయంలో విద్యుత్ వినియోగం 196.22 మిలియన్ యూనిట్లుగా ఉంటే, ఈ ఏడాది 234.25 మిలియన్ యూనిట్ల డిమాండ్ వచ్చిందన్నారు. పొడి వాతావరణం, వేసవిని తలపించేలా పరిస్థితులు ఉండడం వల్ల విద్యుత్ వినియోగం పెరిగిందని, నిత్యం 44.25 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నామన్నారు. మార్చి నుంచి ఆగస్టు వరకు రూ.2935 కోట్లు ఇందుకోసం వెచ్చించినట్లు అధికారులు చెప్పారు. రైతులకు, ప్రజలకు ఇబ్బంది రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రానున్న రోజుల్లోనూ పరిస్థితుల దృష్ట్యా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సీఎం ఆదేశాలిచ్చారు. సమావేశంలో మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, అంబటి రాంబాబు, సీదిరి అప్పలరాజు, ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీయస్ నాగిరెడ్డి, సీఎస్ డాక్టర్ జవహర్ రెడ్డి, ఇంధనశాఖ ప్రత్యేక సీఎస్ విజయానంద్, వ్యవసాయ శాఖ ప్రత్యేక సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, జలవనరులశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్, ఉద్యానవనశాఖ కమిషనర్ డాక్టర్ శ్రీధర్, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ వీసీ అండ్ ఎండీ డాక్టర్ శేఖర్‌బాబు, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర కుమార్, ఏఎన్‌జీఆర్ఏయూ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ప్రశాంతి, జలవనరుల శాఖ ఈఎన్సీ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

జమిలీ ఎన్నికలపై కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

అందుతున్నాయి. 'ఒక దేశం-ఒకే ఎన్నిక' అమలుకు సాధ్యాసాధ్యాలను తెలుసుకొని కేంద్రప్రభుత్వానికి నివేదించేందుకు ఈ కమిటీ ఏర్పాటైంది. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ప్రకటించిన మరునాడే ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాల పరిశీలనకు కమిటీని కేంద్రప్రభుత్వం ఏర్పాటు కావడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలను ఎలా నిర్వహించవచ్చు, అందుకు తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి, 1967లో జరిగినట్లు లోక్‌సభకు, అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం సాధ్యమవుతుందా? వంటి అన్ని అంశాలను కోవింద్ నేతృత్వ కమిటీ పరిశీలించనుంది. ఇదే క్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, నిపుణులతో సంప్రదింపులను మాజీ రాష్ట్రపతి జరపనున్నారని అధికార వర్గాల సమాచారం. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 'ఒక దేశం-ఒకే ఎన్నిక' గురించి మోదీ ప్రచారం చేస్తోంది. ఏకకాలంలో కాకుండా వేర్వేరు సమయాల్లో ఎన్నికలు నిర్వహించడంతో ఆర్థికభారం పడటమే కాకుండా అభివృద్ధి పనికి అంతరాయం కలుగుతుందని వాదిస్తోంది. రాష్ట్రపతిగా ఉన్నప్పుడు కోవింద్ ఈ విషయంలో మోదీ ప్రభుత్వానికి మద్దతిచ్చారు. 2018లో పార్లమెంటులో మాట్లాడుతూ 'తరచూ ఎన్నికలు నిర్వహించడం వల్ల మానవరులపై భారం ఎక్కువ కావడమే కాదు ప్రవర్తనా నియమావళి అమలు క్రమంలో అభివృద్ధి కుంటుపడుతుంది' అని కోవింద్ అన్నారు. జమిలి ఎన్నికలపై రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదురుతుందని ఆకాంక్షించారు. మోదీ ప్రభుత్వ రెండవ పదవీ కాలం ముగింపు దశకు చేరుకుంది. ఇక ఈ అంశాన్ని సాగదీయడం సరికాదన్న భావన ప్రభుత్వ పెద్దల్లో ఉందట అందుకే దీని అమలుకు కసరత్తు మొదలు పెట్టిందని తెలుస్తోంది. ఇప్పటివరకు తమకు కలిసివచ్చిన ప్రచార్భాటాల వలె ఈ నిర్ణయం కూడా సత్ఫలితాలిస్తుందని, విపక్షాన్ని ఆశ్చర్యపరుస్తుందని కమలం పార్టీ వర్గాలు నమ్ముతున్నాయి. ఐదు రాష్ట్రాల్లో (మిజోరం, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణ, రాజస్తాన్) అసెంబ్లీ ఎన్నికలు నవంబరు-డిసెంబరు నెలల్లో జరగనున్నాయి. వచ్చే ఏడాది మే-జూన్‌లో లోక్‌సభ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వ చర్యలు రాష్ట్రాల్లోని అసెంబ్లీల ఎన్నికలతో పాటు సార్వత్రిక ఎన్నికలు జరగవచ్చన్న సంకేతాలు ఇస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్‌లో ఎన్నికలు జరగనున్నాయి. అధికారికంగా కూటమిలో లేకున్నాగానీ ఆంధ్రప్రదేశ్, ఒడిశా ముఖ్యమంత్రులు జగన్‌మోహన్ రెడ్డి, నవీన్ పట్నాయక్‌తో బీజేపీకి సత్సంబంధాలున్నాయి. అరుణాచల్‌లో బీజేపీ అధికారంలో ఉంది. సిక్కింలో బీజేపీ మిత్రపక్ష పాలన సాగుతోంది. మహారాష్ట్ర, హరియాణా రాష్ట్రాల్లో మిత్రపక్షాలతో కలిసి అధికారాన్ని పంచుకుంటోంది. వీటితో పాటు జేఎంఎం-కాంగ్రెస్ పాలిత జార్ఖండ్‌లో ఎన్నికలు లోక్‌సభ ఎన్నికల తర్వాత జరగనున్నాయి.

10న విద్యుత్ ఉద్యోగుల ధర్నా

షరతులతో హైకోర్టు అనుమతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ కార్మిక సంఘాలు విజయవాడ నగరంలో చేపట్టనున్న ధర్నాకు హైకోర్టు అనుమతి ఇచ్చింది.

విద్యుత్ ఉద్యోగ సంఘాలు... తమకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆందోళనకు పిలుపునిచ్చింది. అయితే ఆందోళన చేయడానికి వీల్లేదని, ధర్నాకు వెళితే ఎస్మా ప్రయోగిస్తామని రాష్ట్రప్రభుత్వం హెచ్చరించింది. భారీగా పోలీస్ బలగాలను మోహరించి భయానక వాతావరణాన్ని సృష్టించింది. విద్యుత్ కార్మిక సంఘాల నేతలను హౌస్ అరెస్టులు చేసి నిర్బంధించింది. దీంతో సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా చేపట్టే ఆందోళన కార్యక్రమానికి పోలీసులకు అనుమతి ఇవ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, ఏపీ విద్యుత్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్, ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ నేతలు హైకోర్టును ఆశ్రయించారు.

వీరు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన హైకోర్టు షరతులతో కూడిన అనుమతిని మంజూరు చేసింది. ఈ నెల 10వ తేదీ ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల లోపు ధర్నా కార్యక్రమం జరుపుకోవాలని సూచించింది.

జగన్ సర్కార్‌కు చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

విచారించాల్సిన అంశాలు చాలా ఉన్నందున తదుపరి విచారణ చేపడతామన్నారు. ఈ మేరకు ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ మూడు వారాల్లో సమాధానం చెప్పాలని ఆదేశించింది. ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేసిన తర్వాత మరో మూడు వారాల్లో రీజాయిండర్ పిటిషన్ దాఖలు చేయాలని పిటిషనర్లను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్‌లో చేపడతామని ధర్మాసనం వెల్లడించింది.

భూ అక్రమాలపై విచారణ జరపాలి

- అర్హులైన పేదలకు అప్పగించండి
- రెవెన్యూ మంత్రికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: కడప జిల్లాలో భూ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి, ఆయా భూములను అర్హులైన పేదలకు అప్పగించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు లేఖ రాశారు. ప్రొద్దుటూరు మండలం, కొత్తపల్లి గ్రామ పంచాయతీలోని సర్వే నంబర్లు 667,668 లోని య.3.84 సెంట్ల భూమిని రియల్టర్లు అక్రమంగా కొనుగోలు చేసి వెంచర్లు వేశారని, ఇది పేదలకు దక్కాల్సిన భూమి అని పేర్కొన్నారు. 2010లో సర్వే నంబర్ 668లో కొంత భూమిని సుగాలీల నివాసాలకు కేటాయించారని, 2012లో సర్వే నంబర్ 667లో ఒక ఎకరా భూమిని ఎరుకుల వారి నివాసాలకు కేటాయించారని తెలిపారు. అయితే 2013 జనవరి 30న వేంపల్లి రాంభూపాల్‌రెడ్డి సర్వే నంబర్ 667/4, పులమి రఘునాథరెడ్డి సర్వే నంబర్ 668/1, 668/2, కుప్పన్న గారి శ్రీనివాసులరెడ్డి సర్వే నంబర్ 668/3, 668/4 కు సంబంధించిన భూములను రిజిస్టర్ చేయించుకున్నారని తెలిపారు. ఈ ముగ్గురు ఆ భూమిని కొనుగోలు చేయక ముందే రెవెన్యూ వారు సర్వే నంబర్ 667లో ఒక ఎకరా, సర్వే నంబర్ 668లో ఒక ఎకరా సుగాలి, ఎరుకల వారికి కేటాయించడం గమనార్హం అన్నారు. వేంపల్లి రాంభూపాల్ రెడ్డి, పులమి రఘునాథరెడ్డి, కుప్పన్నగారి శ్రీనివాసులరెడ్డి అనే ముగ్గురు తమ భూములను నిషేధిత భూముల నుంచి తొలగించాలని కోరుతూ 2017 అక్టోబరు 16న అప్పటి కలెక్టర్‌కు అభ్యర్థన పంపారని వివరించారు. కలెక్టర్ విజయ రామరాజు 2022 మార్చి 23న పై సర్వే నంబర్లను నోటిఫై చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని గుర్తు చేశారు. ఇది 2017 యాక్టు నిబంధనలను ఉల్లంఘించి డినోటిఫై చేయడమేనని పేర్కొన్నారు. వెంటనే పై ముగ్గురు ఆ సర్వే నంబర్లలోని భూమిని 2022 ఆగస్టు 28న రాచమల్లు కిరణ్‌కుమార్ రెడ్డికి అమ్మారని తెలిపారు. 2023లో రాచమల్లు కిరణ్ కుమార్ రెడ్డి ఈ సర్వే నెంబర్లలోని భూమిని తన బినామీ అయిన పాతకోట చరణ్‌తేజా రెడ్డి పేం రిజిస్టర్ చేయించారని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయ నాయకుల అధికార దుర్వినియోగం, రెవెన్యూ, రిజిస్ట్రార్ కార్యాలయాల అక్ర మాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ల్యాండ్ కన్వర్షన్ అవ్వకుండానే వెంచర్లు వేయడమే అందుకు నిదర్శనం అన్నారు. తక్షణమే ఆయా భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి, అర్హులైన పేదలకు కేటాయించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని రామకృష్ణ కోరారు.

జీవో నంబర్ 107, 108 రద్దు చేయాలి

విశాలాంధ్ర-నంద్యాల: రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలల అడ్మిషన్లపై అక్రమంగా తెచ్చిన జీవో నంబర్ 107, 108 ని రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్రలో భాగంగా నంద్యాల పట్టణం నూనెపల్లెలోని వైద్య కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 17 వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడం శుభ పరిణామమని, ఈ సంవత్సరం ఐదు వైద్య కళాశాలలకు అడ్మిషన్లు జరగడం సంతోషకరమన్నారు. కానీ గతంలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లలో కోటా తగ్గించి జీవో నంబర్ 107, 108 తీసుకువచ్చి అధిక డబ్బులకు సీట్లను అమ్ముకోవడం దారుణమన్నారు. వైద్య విద్యను మార్కెట్‌లో వ్యాపారంగా మార్చడం జగన్‌కే చెల్లిందన్నారు. పేదల పక్షపాతినంటూ, పెత్తందారులపై పోరాటం చేస్తానంటూ ప్రగల్భాలు పలికే జగన్ పెత్తందారులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వైద్య సీట్లను జీవో ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రావాల్సిన కోటను కూడా అమ్ముకోవడం దారుణమన్నారు. సెప్టెంబరులో బస్సు యాత్ర తరువాత రాష్ట్ర వ్యాప్తంగా దళిత, గిరిజన, మైనార్టీ విద్యార్థి యువజన సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. ప్రభుత్వం దిగి రాకపోతే ఎన్నికల్లో కూడా ప్రజలకు వీటిపై వివరిస్తామన్నారు. వీరి వెంట ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్ర, నక్కి లెనిన్ బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, ధనుంజయుడు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రణత్ యాదవ్, నాగరాముడు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ ప్రజావ్యతిరేక పాలనను ప్రజలు గుర్తించారు

యువగళం పాదయాత్రలో నారా లోకేశ్

విశాలాంధ్ర-గోపాలపురం/నల్లజర్ల: రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలు గుర్తించారని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలోకి ప్రవేశించింది. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిపాటి వెంకట్ రాజు అధ్వర్యంలో వేలాది నాయకులు, కార్యకర్తల సందోహంతో చేరుకుంది. పోతవరం గ్రామంలో వెంకట్ రాజు ఏర్పాటు చేసిన నారా లోకేశ్ 50 అడుగుల కటౌట్ స్వాగత ద్వారం వద్ద లోకేశ్‌కు స్వాగతం పలికి గజమాలలతో సత్కరించారు. అధిక సంఖ్యలో మహిళలు హారతులు పట్టారు. పోతవరం గ్రామం అంతా పసుపుమయమై లోకేశ్‌కు ఘన స్వాగతం పలికే ఫ్లెక్సీలతో నిండిపోయింది. కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టి ప్రజల నెత్తిన కుచ్చుటోపీ పెట్టిన ముఖ్యమంత్రి జగనేనని అని ఆరోపించారు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్ర ప్రదేశ్ ఉండడం ఆంధ్ర ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం అని ఎద్దేవా చేశారు. కోర్టులు ఒక పక్క మొట్టికాయలు వేస్తున్నా తనను కాదన్నట్టు మొండివైఖరి ఆవలంభించడం ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా రైతులు తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా తమ ప్రాంతానికి నీరు అందించాలని వినతిపత్రం అందించారు. చీపురుగూడెం గ్రామంలో సత్యసాయి బాబా మంచినీటి పథకం కార్మికులు వేలాది ప్రజల దాహార్తి తీర్చిన సత్యసాయి మంచినీటి పథకాన్ని జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, టీడీపీ అధికారంలోకి రాగానే దానిని పునరుద్ధరించాలని వినతిపత్రం అందించారు. కవులూరు సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ ఒప్పంద కార్మికులను తమను రెగ్యులర్ చేయాలంటూ వినతి పత్రం అందించారు. చీపురుగూడెం నుంచి కవులూరు మధ్యలో గల రహదారి గోతులమయం అవ్వడంతో రోడ్డు మీదే వరి నారు ఊడుస్తూ ఇదీ జగన్ రెడ్డి ప్రభుత్వ పనితీరు అని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికలలో సైకో పాలనకు చరమగీతం పాడి సైకిల్ పాలన అధికారంలోనికి తెచ్చేందుకు పాటుపడాలని కోరారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇటీవల మహానాడులో తెలియజేసిన మేనిఫెస్టోను తూచా తప్పకుండా అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ పాదయాత్రలో రాజమండ్రి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి, గన్ని రామాంజనేయులు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ: రైతులు, కౌలు రైతులు సాగు చేస్తున్న ప్రతి ఎకరానికి రూ.10 వేల పెట్టుబడి సాయం అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం,ఆంధ్రప్రదేశ్ కౌలురైతులసంఘాల అధ్వర్యంలో ఏటా సెప్టెంబర్1న రైతాంగ 'డిమాండ్స్ డే' ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం విజయవాడ రూరల్ మండలం రాయనపాడులో జరిగిన కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు సీహెచ్ సుబ్బారావు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జమలయ్య మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని పట్టించుకోవడంలేదని, వారి సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శంచారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ తప్పుడు విధానాల వల్లనే రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, దేశంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యల్లో మన రాష్ట్రం మూడో స్థానంలోనూ, కౌలురైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం పెట్టుబడులు కూడా రాకపోవడంతో రైతులకి తీవ్రనష్టం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అధికారులను పంట పొలాలకు పంపి... రైతుల సమస్యలు తెలుసుకోవాలన్నారు. రెండు లక్షల రూపాయలు లోపు పంట రుణాలన్నీ మాఫీ చేయాలని కోరారు. కౌలు రైతులకు సైతం రైతుభరోసా చెల్లించాలని డిమాండ్ చేశారు. డబల్ ఫైనాన్స్‌తో సంబంధం లేకుండానే కౌలు రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలని కోరారు. కౌలు గుర్తింపు కార్డు లేకపోయినా స్వీయ ధృవీకరణతో కౌలురైతుల పంటలను ఇ-క్రాప్ బుకింగ్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కౌలురైతులు సాగు చేస్తున్న అన్ని రకాల పంటలకు భీమా పథకాన్ని వర్తింపచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు పెయ్యల వెంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పెయ్యల పృథ్వీ, బత్తుల సత్యనారాయణ, బీ రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుపై రూ.2.45 లక్షల రుణభారం

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-పెదకాకాని: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాల కారణంగా రాష్ట్రంలోని ప్రతి రైతు రూ.2.45 లక్షల రుణ భారంతో ఉన్నారని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. రైతు డిమాండ్ డేను రైతు సంఘం అధ్వర్యంలో శుక్రవారం పెదకాకానిలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ జెండాను ఆవిష్కరించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయిన కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఆత్మహత్యలలో మన రాష్ట్రం మూడవ స్థానంలో ఉందని, వీరిలో అత్యధికులు పేద రైతులు, కౌలు రైతులు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధర అశాస్త్రీయంగా ఉందన్నారు. పండించిన పంటను కనీస మద్దతు ధరకు రైతులు అమ్ముకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చేసిన వాగ్దానాలు అమలుకు నోచుకోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం మాదిరి ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా ఎకరాకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించాలని, రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని పండించే కౌలు రైతులకు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించాలని, స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూడు నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో 550 రైతు సంఘాలు రహదారులను దిగ్బంధం చేసి రెండు సంవత్సరాల పాటు దీక్షలు నిర్వహిస్తే నరేంద్ర మోదీ తల వంచి ఆ చట్టాలను రద్దు చేస్తున్నామని హామీ ఇచ్చి, తర్వాత పక్కన పెట్టారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి అడుగులకు మడుగులు వత్తుతూ రైతుల బోరుబావుల మోటార్లకు మీటర్లు బిగించేందుకు ఒప్పందం చేసుకున్నారని, ఆ ఒప్పందాన్ని రైతులందరూ ఐక్యంగా పోరాడి తిప్పికొట్టాలన్నారు. నవంబరు 26, 27, 28 తేదీలలో రాజధానిలో రైతుల నిరసన కార్యక్రమాలు జరుగుతాయని, జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులందరూ ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఢిల్లీలో రైతుల పోరాటానికి గుర్తుగా అక్టోబరు 3న రైతు నిరసన డే ను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జగన్నాథం, విఠల్‌రెడ్డి, సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, దర్శి, లింగారావు, రెంటాల కుమారి, కేతినేని అగస్టీన్, ఆరుదల కృష్ణమూర్తి, కూసం నాగిరెడ్డి, నారా ప్రసాద్, సొలస వెంకటేశ్వరరావు, బండ్లమూడి శరత్ బాబు, మోజేష్ బాబు, వీరయ్య, జిలేబి రవి తదితరులు పాల్గొన్నారు.

పండగపూట నీటి కటకట

పట్టించుకోని అధికారులు - ఆందోళనలో గ్రామస్తులు

విశాలాంధ్ర-డోన్ రూరల్: వేసవి కాలం రాకుండానే కర్నూలు జిల్లా, డ్రోన్ మండలంలోని గుమ్మకొండ గ్రామంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. కొంతమంది కృత్రిమ నీటి సమస్యను సృష్టించడంతో తాగునీటి కోసం గ్రామస్తులు అష్ట కష్టాలు పడుతున్నారు. ఇప్పటివరకు ఈ గ్రామంలో నీటి కొరత లేదు కానీ కొంతమంది నాయకులు తమ అధికారాన్ని అడ్డుపెట్టుకొని మంచినీటి ట్యాంకుకు నీరు రాకుండా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ట్యాంకుకు నీరు వచ్చే పైపు ద్వారా నీటిని తమ పొలాలకు కొందరు రైతులు మళ్లిస్తున్నందునే ఈ పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఏటా శ్రావణమాసంలో పాతపాలెం ఆంజనేయ స్వామి ఉత్సవం జరుగుతుంది. పండగ పూట నీటి కటకట గ్రామస్తులను ఆందోళనకు గురిచేస్తోంది. తమ తమ పొలాల పనులను వదులుకొని బిందెలతో, సైకిళ్లపై, స్కూటర్ల మీద తాగునీటి తెచ్చుకునేందుకు గ్రామస్తులు పడరాని పాట్లు పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఫలితం లేదు. దీంతో నీటి సమస్య పరిష్కారం ఎప్పుడన్నది ప్రశ్నార్థకంగా మారింది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించాలని, తగు చర్యలు తీసుకొని, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సబ్ ప్లాన్ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎస్సీ సబ్‌ప్లాన్‌కు 2023-24లో రూ.1,486 కోట్ల అదనపు కేటాయింపులు చేశామంటూ చెబుతున్న మంత్రి నాగార్జున, దారిమళ్లిం చిన నిధులపై ఎందుకు మాట్లాడటం లేదని టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజు ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, సబ్ ప్లాన్ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ కాంపోనెంట్ నోడల్ ఏజెన్సీలను నిర్వీర్యం చేసి, ఇప్పుడు వివిధ శాఖల వివరాలు పం పాలని కోరడం హాస్యాస్పదమన్నారు. ఎన్ని వేల కోట్లు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి నవ రత్నాలకు మళ్లించారో మంత్రి దళితులకు సమాధానం చెప్పాలన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్‌కు గతేదాది కంటే ఈ ఆర్థిక సంవత్సరం రూ.1,486 కోట్లు అదనపు కేటాయింపులు చేశామంటూ ఎస్సీ సబ్‌ప్లాన్ నోడల్ ఏజెన్సీ సమావేశంలో మంత్రి మేరుగ నాగార్జున చేసిన వ్యాఖ్యలను రాజు ఆక్షేపించారు.

అయ్యన్నపాత్రుడు అరెస్టు...విడుదల

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ ఎయిర్‌పోర్టులో టీడీపీ నేత, మాజీమంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడును అరెస్టు చేసిన పోలీసులు అనకాపల్లిజిల్లా తాళ్లపాలెం ఎలమంచిలి మధ్య హైవేపై విడిచిపెట్టారు. అయ్యన్నను అరెస్టు చేశారన్న వార్తా దావానలంగా పాకడంతో నక్కపల్లి ప్రాంతంలో భారీ సంఖ్యలో టీడీపీ శ్రేణులు మోహరించారు. దీంతో పోలీసులు ముందుగానే అయ్యన్నకు 41(ఏ) నోటీసు ఇచ్చి విడిచిపెట్టారు. నక్కపల్లి మండలం టోల్‌ప్లాజా ముందున్న కాగిత జాస్ హెూటల్‌కు అయ్యన్నపాత్రుడు, టీడీపీ శ్రేణులు చేరుకున్నారు. ఢిల్లీ నుంచి విశాఖపట్నం వచ్చిన అయ్యన్నను ఎయిర్‌పోర్టులోని కృష్ణా జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల గన్నవరం యువగళం సభలో ముఖ్యమంత్రి, మంత్రుల్ని అయ్యన్న విమర్శించిన విషయం తెలిసిందే. గన్నవరంలో లోకేశ్ బహిరంగసభలో ప్రసంగాలకు సంబంధించి టీడీపీ నేతలపై కేసులు నమోదు అయ్యాయి. మాజీ మంత్రి పేర్ని నాని ఫిర్యాదుతో అయ్యన్నపై కేసు నమోదు అయ్యింది. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అయ్యన్నపై పలు ఐపీఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు అయ్యాయి. ఈ సందర్భంగా విశాఖలో టీడీపీ నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. అయ్యన్నపాత్రుడుని మఫ్టీలో వచ్చిన పోలీసులు అరెస్టు చేయడంపై పలువురు నేతలు మండి పడ్డారు. కిడ్నాప్ తరహాలో అయ్యన్నపాత్రుడిని పోలీసులు తీసుకెళ్లి విడిచిపెట్టారని మండిపడ్డారు. నోటీసులు ఇస్తే ఎయిర్ పోర్టులోనే ఇచ్చి వెళ్లిపోవాలి కదా అని ప్రశ్నించారు.

ఏపీసెట్ నిర్వహించండి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఏపీసెట్) పరీక్షను రెండేళ్ల నుంచి నిర్వహించకపోవడం వల్ల పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) చదివిన విద్యార్థులు నష్టపోతున్నారని, తక్షణమే ఏపీసెట్ నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు మహంకాళి సుబ్బారావు డిమాండు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డికి శుక్రవారం ఆయన ఒక లేఖ రాశారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలు, డిగ్రీ కళాశాల లెక్చరర్ల భర్తీ కోసం ఏపీపీఎస్సీ ద్వారా ప్రకటనలు రాబోతున్నాయని, ఈ నేపథ్యంలో వాటికి దరఖాస్తు చేసేందుకుగాను పీజీతోపాటు ఏపీసెట్‌లో అర్హత సాధించి ఉండాలన్నారు. ఏపీ సెట్ నిర్వహించనందున దాదాపు 50వేల మంది పీజీ చదివిన విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం ఏడాదికి ఒక సారి ఏపీసెట్ పరీక్షను ఖచ్చితంగా నిర్వహించాల్సి ఉండగా, రాష్ట్రంలో 2021 తర్వాత ఏపీ సెట్‌ను నిర్వహించలేదని గుర్తుచేశారు. తక్షణమే ఏపీసెట్ పరీక్షకు ప్రకటన ఇచ్చి, పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు న్యాయం చేయాలని ఆ లేఖలో సుబ్బారావు విజ్ఞప్తి చేశారు.

రూ.118కోట్ల స్వాహా నిజమేనా?

చంద్రబాబు నోరు విప్పాలి : పేర్ని నాని సవాల్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రాజధాని పేరిట రూ.118 కోట్లు స్వాహా చేసినట్లు వచ్చిన వార్తల్లో నిజమెంతో ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయకుడు తేల్చాలని మాజీ మంత్రి పేర్ని నాని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో ఆదయపు పన్ను శాఖ నోటీసులు ఇచ్చిందో లేదో ఆయన స్పష్టతివ్వాలన్నారు. హిందూస్తాన్ టైమ్స్‌లో వచ్చిన వార్త ఆధారంగా చంద్రాబాబును పేర్ని నాని నిలదీశారు. నిఖార్సయిన నాయకుడివే అయితే మాట్లాడు అంటూ చంద్రబాబుకు సవాల్ విసిరారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పేర్ని నాని మాట్లాడుతూ బాబు చిలక్కొట్టుడు గుట్టును ప్రముఖ పత్రిక బయటపెట్టిందన్నారు. దొరికింది రూ.118 కోట్లు మాత్రమే కాగా ఆయన ఇంకా ఎక్కడ, ఎంతెంత తిన్నారో అని వ్యాఖ్యానించారు. నాడు జనం సొమ్ము హల్వాలా చేసి ఇప్పుడు అధికారం కోసం వెంపర్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన ఘనుడు చంద్రబాబు అని పేర్ని నాని ఎద్దేవా చేశారు. 2014లో ఇచ్చిన హామీలకు దిక్కు లేదుగానీ భవిష్యత్‌కు హామీ అంటున్నారని దుయ్యబట్టారు. అవసరానికి వాడుకుని వదిలేయడం బాబుకు అలవాటని, నాడు అధికారం కోసం బీజేపీతో జత కట్టి తర్వాత వదిలేశారు. ఇప్పుడు మళ్లీ కలుపుకునే ప్రయత్నాలు చేస్తున్నారు' అని చంద్రబాబునుద్దేశించి పేర్ని నాని విమర్శించారు. '40 ఏళ్ల అనుభవమున్న చంద్రబాబుకు నిజాయితీ ఉంటే, రెండు కంపెనీల నుంచి రూ.118 కోట్లు లంచం తిన్నట్లు ఆదాయపు పన్ను శాఖ నోటీసు ఇచ్చింది వాస్తవమా? కాదా? చెప్పాలి' అని సవాల్ చేశారు. మైకులు పట్టుకుని ఊదరగొట్టడం కాదు వాస్తవాలు మాట్లాడాలన్నారు. ఈనెల నుంచి భవిష్యత్తు హామీ అంటున్నారు... ఈయన ఇచ్చే హామీ ఏమిటో మరి అంటూ చంద్రబాబును ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే వివక్ష లేకుండా వాగ్దానాలను నెరవేస్తానన్నారంటే గతంలో వివక్ష చూపారనే కదా అర్థమని వ్యాఖ్యానించారు. 'హిందూస్తాన్ టైమ్స్‌పై కేసు పెట్టే ధైర్యం ఉందా? చేనేత వర్గ మహిళైన పోతుల సునీత మీద కాదు మీ పౌరుషమేంటో హిందుస్తాన్ టైమ్స్‌పై పరువు నష్టం దావా వేసి నిరూపించుకో' అని నారా లోకేశ్‌కు పేర్ని నాని సవాల్ విసిరారు.

ఆర్థిక నేరాల కథనాలపై మీ సమాధానం ఏమిటి...?

- వార్త ప్రచురించిన పత్రికపై కేసు పెడతారా...
- చంద్రబాబుకు మంత్రి అమర్నాథ్ సూటి ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: అవినీతి చక్రవర్తి చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు పాల్పడిన ఆర్థిక నేరాలు ఒక ఆంగ్ల పత్రిక ద్వారా బహిర్గతమయ్యాయని, ఇవన్నీ తప్పని, తాను నిజాయితీపరుడనని చంద్రబాబు నిరూపించగలరా...? ఈ కథనాలు రాసిన పత్రికపై కేసు వేయడానికి చంద్రబాబు లేదా లోకేశ్ ముందుకు వస్తారా... అని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ప్రశ్నించారు. శుక్రవారం సర్క్యూట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోకేష్ తల్లిని తాము పల్లెత్తు మాట కూడా అనకపోయినా, తమపై కేసులు పెట్టడానికి ముందుకు వచ్చారని, ఇప్పుడు తన తండ్రిపై వచ్చిన కథనాలు తప్పని ఆయా పత్రికలపై కేసులు వేయడానికి ముందుకు వసారా లేక నా తండ్రికి నాకు ఎటువంటి సంబంధం లేదని వదిలేస్తారా అని ప్రశ్నించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు చేసిన ఆర్థిక నేరాలు, ముడుపుల వ్యవహారాలు రుజువులతో సహా పత్రికల్లో వచ్చాయని, వాటిని ఆయన ఖండించకపోవడాన్ని బట్టి చూస్తే, అవన్నీ నిజమేనని స్పష్టమవుతోందని అమర్నాథ్ చెప్పారు. గతంలో తాను అసెంబ్లీలో ఇదే అంశంపై అన్ని ఆధారాలతో సుమారు 45 నిమిషాలు మాట్లాడానని అమ ర్నాథ్ తెలియజేశారు. చంద్రబాబు ఆస్తులపై ఆదాయపన్నుల శాఖ దాడులు నిర్వహించినప్పుడు లెక్కల్లో లేని రూ.2,000 కోట్లు దొరికినట్లు ఆధారాలతో సహా సంబంధిత శాఖ బహిర్గతం చేసిందని అమర్నాథ్ చెప్పారు. 2016కు ముందు నుంచే కాంట్రాక్టర్ల దగ్గర కిక్ బ్యాగ్స్ తీసుకున్నాడని, అమరావతి నిర్మాణాలలో అవినీతి సొమ్మును డొల్ల కంపెనీ లకు చంద్రబాబు ఏ విధంగా బదలాయించారో ఆయన వ్యక్తిగత కార్యదర్శి ద్వారా ఆదాయపన్నుల శాఖ అధికారులు తెలుసుకున్నారని అన్నారు. అవినీతి అంటే ఏంటో తనకి తెలియదని, అవినీతి డబ్బు తాను ఎప్పుడూ చూడలేదని చెప్పుకునే చంద్రబాబు, పత్రికల్లో వచ్చిన కథనాలకు ఎందుకు జవాబు చెప్పలేకపోతున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు పూర్తిగా అవినీతి ఊబిలో కోరుకుపోయారని, తన అవినీతి సామ్రాజ్యం కూలిపోతుందని తెలిసి ఆయన ఢిల్లీ పెద్దల కాళ్లు పట్టుకుంటున్నారని అమర్నాథ్ వ్యాఖ్యానించారు. తన చివరి రోజులు చంద్రబాబు జైలులో గడపాల్సిందేనని ఆయన అన్నారు. చంద్రబాబు ఈ జన్మలో చేసిన పాపాలు ఈ జన్మలోనే అనుభవిస్తారని ఆయన అన్నారు. ఇప్పుడు ఆయన... భవిష్యత్తుకి గ్యారెంటీ అంటూ కొత్త నిదానంతో ప్రజల ముందుకు వస్తున్నారని, గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానమైనా నెరవేర్చలేదని అమర్నాథ్ విమర్శించారు. రైతులు, మహిళలను పూర్తిగా మోసం చేసిన చంద్రబాబును నమ్మద్దని మంత్రి అమర్నాథ్ ప్రజలకు హితవు పలికారు.

బీజేపీ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారు

గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆడుతున్న ఎన్నికల నాటకాలను ప్రజలందరూ గమనిస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. దేశంలో త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, పదేళ్లలో రెట్టింపు చేసిన గ్యాస్ సిలిండర్ ధరపై హఠాత్తుగా రూ.200 తగ్గించడం వెనుక ఆంతర్యం గమనించాలన్నారు. ఈ మేరకు శుక్రవారం రుద్రరాజు ఒక ప్రకటన విడుదల చేస్తూ, బీజేపీ మొసలి కన్నీరును, ఎన్నికల ముందు పేదలపై కురిపిస్తున్న సవతి తల్లి ప్రేమను అందరూ గమనిస్తున్నారని పేర్కొన్నారు. గౌతమ్ అదానీ అక్రమ ఆర్థిక లావాదేవీలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకే కంటి తుడుపు చర్యగా కేంద్రం రూ.200 తగ్గించిందన్నారు. ఆర్థిక వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ దేశం లక్షల కోట్ల రూపాయిల అప్పుల్లో కూరుకుపోవడంపై కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. దశాబ్దకాలంలో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు మాత్రం బ్యారెల్‌కు 101 డాలర్ల నుంచి 86 డాలర్లకు తగ్గిన విషయాన్ని అందరూ గమనించాలని రుద్రరాజు అన్నారు. దేశంలోని సుమారు 31.37 కోట్ల లబ్ధిదారుల నుంచి గ్యాస్ ధరల పెంపు పేరుతో దాదాపు పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం రూ.8,33,640 కోట్లను దోపిడీ చేసిందని వివరించారు.

సంపాదకీయం

ప్రతిపక్షాల సమైక్యశంఖానాదం

జూన్ 23వ తేదీన పట్నాలో ప్రతిపక్ష పార్టీలన్నీ సమావేశమై మోదీని గద్దె దించాలన్న సంకల్పం వ్యక్తం చేసినప్పుడు ప్రతిపక్ష ఐక్యత గురించి అనుమానాలు వ్యక్తంచేసిన వారికి కొదవలేదు. ఆ తరవాత జులై 17-18 తేదీల్లో బెంగళూరులో రెండవ సమావేశం నిర్వహించిన ప్పుడు ప్రతిపక్ష ఐక్యతపై స్పష్టమైన ఆశలు చిగురించాయి. గురు, శుక్రవారాల్లో ముంబైలో ప్రతిపక్షాలు మూడవసారి సమావేశం అయినప్పుడు ప్రతిపక్ష ఐక్యత స్పష్టంగా గోచరించింది. ప్రతిపక్షాల ఐక్య సంఘటన 'ఇండియా' అంతిమంగా విజయం సాధిస్తుందా లేదా అన్నది ఎన్నికల పండితుల, విశ్లేషకుల పని. కానీ మూడు సమావేశాల సరళిని పరిశీలిస్తే ప్రతిపక్షాల ఐక్యత అంతకంతకూ బలపడుతున్నట్టు గోచరిస్తోంది. మోదీని ఓడించి తీరగలమన్న అచంచల విశ్వాసమూ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. అధికారంలో ఉన్న పార్టీని లేదా కూటమిని గద్దె దించడానికి, ప్రత్యామ్నాయ రాజకీయ పంథా నిర్దేశించడానికి ప్రయత్నాలు జరగడం ఇదే మొదటిసారి కాదు. ఎమర్జెన్సీ తరవాత ఇందిరాగాంధీని గద్దె దించడానికి ప్రతిపక్షాలు ఏకమైనాయి. నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాలు ఏర్పడడానికి కారణం కూడా ప్రతిపక్షాలు ఒక్క తాటి మీదకు రావడమే. ఇప్పుడు ఆ ప్రయత్నం మరింత బలంగా, విస్తృతంగా, దీక్షాబద్ధంగా సాగుతోంది. ముంబైలో జరిగిన మూడవ సమావేశంలో మోదీని గద్దెదించి తీరాలన్న సంకల్పం స్పష్టంగా కనిపించింది. ప్రతిపక్షాలు తమ ఐక్య సంఘటనకు 'ఇండియా' అని నామకరణం చేసినప్పుడు బీజేపీ రకరకాలుగా ఎద్దేవా చేసింది. కానీ ముంబై సమావేశంలో 'భారత్ జుడేగా- ఇండియా జీతేగా' అన్న నినాదంతో ప్రతిపక్షం దీటైన సమాధానం ఇచ్చింది. భారత్ అన్న మాట బీజేపీ గుత్త సొత్తు కాదని ప్రకటించింది. ప్రతిపక్షాలు సమైక్యమై, మోదీని గద్దె దించితే తప్ప ఈ దేశానికి నిష్కృతి లేదన్న నిర్ధారణకు రావడానికి, ఈ సంకల్పాన్ని ఆచరణలోకి మార్చడానికి ఇంతకన్నా అనువైన సమయం మరేదీ ఉండదు. ప్రతిపక్షాలు సమైక్యంగా పోరాడి మోదీని గద్దె దించగలిగితే ప్రజాస్వామ్యాన్ని, సెక్యులరిజాన్ని కాపాడే బృహత్తర బాధ్యత నిర్వర్తించడానికి ఇంతకుమించిన అదును ఉండదు. రెండురోజుల ప్రతిపక్ష చర్చల్లో మాట్లాడిన అనేకమంది నాయకులు అదానీ తాజా కుంభకోణాలను ప్రస్తావించి మోదీ సంకుచిత ఆశ్రిత పక్షపాతాన్ని మరోసారి బహిర్గతం చేయగలిగారు. ఈమధ్యలో మోదీ ప్రతిపక్షపార్టీలన్నీ అవినీతిమయమైన వేనని, వంశపారంపర్య పాలన కొనసాగిస్తాయని ఆక్షేపిస్తున్నారు. అదానీ కుంభకోణాలను లేవనెత్తడం ద్వారా ప్రతిపక్షాలు మోదీ వేస్తున్న అవినీతి ముద్రను చెరిపేసే ప్రయత్నం ముంబైలో కనిపించింది. అలాగే ఈ దేశం అంతా ఒకే పరివారం అని, అనువంశిక పాలన కొనసాగిస్తాయన్న నిందకు సమైక్య ప్రతిపక్షం గట్టిగా జవాబివ్వగలిగింది. ప్రతిపక్షం చీలికలు వాలికలుగా ఉన్నందువల్లే మోదీ ఇష్టారాజ్యం కొనసాగించగలుగుతున్నారు. 'ఇండియా' భాగస్వామ్య పక్షాలైన పార్టీల మధ్య వివిధ రాష్ట్రాలలో విరోధాలు ఉండవచ్చు. సైద్ధాంతికంగా సంపూర్ణమైన ఏకసూత్రత కొరవడి ఉండవచ్చు. కానీ ఈ పార్టీలన్నీ ప్రజాస్వామ్య పరిరక్షణకు, సెక్యులరిజాన్ని కాపాడడానికి, విద్వేష రాజకీయాలను ఎదిరించడానికి దృఢ దీక్షతో ఉన్నాయి. ప్రస్తుత తరుణంలో ఈ లక్ష్యాలే ప్రతిపక్షాలు ఏకంకాక తప్పని పరిస్థితి కల్పిస్తున్నాయి. ఇప్పుడు ఐక్యం కాకపోతే దేశాన్ని వంచించినట్టేనన్న అభిప్రాయం ప్రతిపక్ష పార్టీలన్నింటిలోనూ ఉంది. ప్రతిపక్షాలు సమైక్యంగా ఉంటే మోదీని ఓడించే అవకాశాలు ఎంతగా ఉంటాయో వివిధ గణాంకాలను పరిశీలిస్తే అర్థం అవుతుంది. 2019లో బీజేపీ సాధించింది 37 శాతం ఓట్లే. ఆయనను వ్యతిరేకించిన ఓటర్లు 63 శాతం ఉన్నారు. అయితే మోదీని వ్యతిరేకించే వారి మధ్య ఏకశ్రుతి లేనందువల్ల ఆయన 2014లో కన్నా ఎక్కువ స్థానాలు సంపాదించగలిగారు. సమైక్య ప్రతిపక్షం మోదీని ఓడించి తీరగలదన్న విశ్వాసం అరేబియా సముద్రం ఒడ్డు నుంచి దేశమంతటా వినిపించేలా ప్రతిధ్వనించింది.

2019లో గెలిచిన బీజేపీకి, మిగతా ప్రతిపక్షాలకు మధ్య ఉన్న ఓట్ల అంతరం మూడు శాతం మాత్రమే. 326 లోకసభ నియోజకవర్గాలలో ఇప్పుడు 'ఇండియా' కూటమిలో ఉన్న పార్టీలకు రెండో స్థానం దక్కింది అన్న వాస్తవం ప్రతిపక్షాల విశ్వాసానికి పునాది. ఐక్య ప్రతిపక్షం మూడుశాతం ఓట్ల తేడాను పూడ్చి 326 స్థానాలలో ఎక్కువ చోట్ల రెండో స్థానం నుంచి మొదటి స్థానానికి చేరగలిగితే మోదీని ఓడించడం సమస్యే కాదు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీని ఓడించినప్పుడు ప్రతిపక్షాలు అప్పుడు విడివిడిగా ఈ రకమైన విజయాన్నే సాధించగలిగాయి. ఇప్పుడున్న ఐక్యత అప్పుడు లేదు. కనీసం 450 నియోజకవర్గాలలో ముఖాముఖి పోటీ ఉండాలన్న లక్ష్యంతో 'ఇండియా' ముందుకెళ్తోంది. 2024లో బీజేపీ అపజయం తప్పదన్న ఆందోళన మోదీ ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే ఆయన తొమ్మిదేళ్ల కింద పక్కన పడేసిన ఎన్.డి.ఎ. పేరు మళ్లీ జపిస్తున్నారు. తమను సమర్థించే పార్టీలను సమీకరించకపోతే అపజయం అనివార్యమని ఆయన గ్రహించారు కనకే ఎన్.డి.ఎ. పునరుద్ధరణ ప్రస్తావన చేస్తున్నారు. అయితే 'ఇండియా' ఐక్య సంఘటనకు నాయకులు ఎవరు అని మోదీ ఇంకా ప్రశ్నిస్తూనే ఉన్నారు. పెళ్లి కొడుకు లేకుండా పెళ్లి ఊరేగింపు ఏమిటి అని హేళన చేస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను గద్దె దించిన ఏ సందర్భంలోనూ నాయకుడిని ముందే ప్రకటించలేదు. జనతా, నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు ఎన్నికలకుముందే నాయకుడిని ప్రకటించకుండానే జరిగాయి. అప్పటి ప్రతిపక్షాల లక్ష్యం నెరవేరింది. రాహుల్ గాంధీని నాయకుడిగా ప్రకటిస్తే ఒక ఆట ఆడుకోవచ్చునన్నది మోదీ అత్యాశ. ఇప్పటివరకు 'ఇండియా' ఉమ్మడి నాయకత్వానికే ప్రాధాన్యం ఇస్తోంది. ఎన్నికలలో గెలిస్తే ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరో నిర్ణయించడం అనివార్యం అవుతుంది. అప్పుడు ఈ సమస్యకు పరిష్కారం దొరకకుండా ఉండదు. ముంబై సమావేశంలో 14 మందితో సమన్వయ కమిటీని ఏర్పరచడం, అందులో ఉన్న సభ్యుల్లో అందరికన్నా సీనియర్ శరద్‌పవార్ ఉండడం ఆయన ఇటీవల కనబరుస్తున్న ఊగిసలాటకు స్వస్తి పలికినట్టే అనుకోవాలి. ప్రతిపక్షాలు స్పష్టమైన లక్ష్యంతో ఐక్యం అవుతున్న సమయంలో మోదీ ఇంకా ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టరేట్ లాంటివాటిని ప్రయోగించి ప్రతిపక్షాలను వికలంచేయాలన్న కుటిల పన్నాగాల్లోనే నిమగ్నమైనారు. మోదీ చేస్తున్నపని అధికార దుర్వినియోగం. ప్రతిపక్ష ఐక్యత దుర్నీతిని, దుష్పరిపాలనను, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించే సత్సంకల్పం. ఈ రెండింటికీ మధ్య ఉన్న తేడా ఏమిటో ప్రజలు గ్రహించలేరు అనుకుంటే అది ఆత్మవంచనే అవుతుంది. బీజేపీకి గట్టి బలమున్న రాష్ట్రాలూ ఉన్నాయి. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, బీహార్‌లో పరిస్థితి భిన్నమైంది. దక్షిణాది రాష్ట్రాలలో అదే పరిస్థితి. ఏ సంకీర్ణంలోనైన భిన్నాభిప్రాయాలు ఉంటాయి. ఇవి భేదాభిప్రాయాల స్థాయిలోనూ ఉండొచ్చు. కానీ లక్ష్యం బలమైందైతే ఈ సమస్యలన్నీ కురచన అయిపోతాయి.

అపూర్వ సోదరులు

చక్రవాకం

\- ముక్కాము చక్రధర్

"ఆస్తి కోసం అన్న హత్య" .... "ఎకరం పొలం కోసం తమ్ముడ్ని, మరదల్ని చంపిన అన్న" ఇవీ ఈ మధ్య మనకి పత్రికల్లో కనిపిస్తున్న వార్తలు. మానవ సంబంధాలు లేకుండా పోయాయి అని బాధపడుతున్న రోజులు. హత్యల వరకూ కాదు కాని... డబ్బు సంపాదన, పదవీ వ్యామోహం, చెప్పుడు మాటలు వినడం వంటి అకాల కారణాల వల్ల ఎందుకో కుటుంబ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిపోతున్న దశలో ఉన్నాం. ఈ వార్తలు విన్న మరుక్షణం అయ్యో అని కాసిన్ని కన్నీళ్లు కార్చడం... చదువుతున్న పేపర్‌ని అక్కడే పడేసి ఓ విషాదంలో కొంతసేపు కూరుకుపోవడమో.... కాఫీ తాగిన కప్పును విసిరికొట్టలేక విసవిసా నడుచుకుంటూ వెళ్లిపోవడం మన దైనందిన చర్యగా మిగిలిపోతోంది. ముఖ్యంగా అన్నదమ్ముల మధ్యలోకి వారి భార్యలు వచ్చిన తర్వాత నెపాన్ని కాసేపు వారి మీదకు నెట్టేసి... "ఈ ఆడాళ్లున్నారే" అంటూ ఓ అసంబద్ధ తృప్తిని అనుభవిస్తున్నాం. దీనికి నేను, నువ్వు, మనమెవ్వరం మినహాయింపు కాదు. కుటుంబ సంబంధాల కొలిమి రాజుకుంటున్న వేళ ఇది. ఇలాగే ఉంటుంది. ఇలాగే ఉండాలేమో అని కూడా ఓ భ్రమలో బతికేస్తున్నాం. ఈ మధ్య నాకు ఆ భ్రమలు కొద్దిగా తొలిగిపోయాయి. ఆ భయాలు వ్యక్తిగతమే తప్ప సామూహికం కాదని అర్థం అయ్యింది.

మొన్నీమధ్యనే నేను ఇద్దరు అన్నదమ్ముల్ని కలిసాను. ఇద్దరూ రోజూ కలుసుకుంటూ ప్రేమలు పంచుకునే మనుషులు కాదు. ప్రతి గంటకో, అరగంటకో ఫోన్‌చేసి కుశల ప్రశ్నలు వేసుకునే వారుకాదు. వారి వారి రంగాల్లో వారిద్దరి జీవితాలు చాలా బిజీ. ఆ ఇద్దరే రాయలసీమ హక్కుల సాధనకోసం తన జీవితాన్ని ధారపోసిన, పోస్తున్న భూమన్. మరొకరు ఆయన తమ్ముడు భూమన కరుణాకర రెడ్డి. ఈయన తిరుపతి ఎమ్మెల్యే. తిరుమల తిరుపతి దేవస్థానానికి కొత్తగా నియమితులైన చైర్మన్. పైకి కనిపించే లౌకిక ప్రపంచానికి వీరిద్దరు అన్నదమ్ములు. వారి ఆత్మల ప్రపంచానికి మాత్రం తండ్రీ కొడుకులు. గురు శిష్యులు. యవ్వన దశలో ప్రారంభమైన వామపక్ష భావజాలం అడుగులు వృద్ధాప్య దశలోనూ కొనసాగిస్తున్న రచయిత భూమన్. ఆ నూనూగు మీసాల నూత్న యవ్వనంలో తుపాకీ గొట్టం ద్వారానే సమాజాన్ని మార్చాలని కన్న కలలు ఆవిరైపోతూంటే ముందుగానే గ్రహించి పార్లమెంటరీ మార్గం వైపు అడుగులు వేసిన తమ్ముడు కరుణాకర్ రెడ్డి.

" పులి గుహలోకి వెళ్ల సాహసించిన వాడే
పులి పిల్లను పట్టి తెస్తాడు..."

అన్నాడు విప్లవ కవి శివసాగర్. ఐదు దశాబ్దాల క్రితమే పులి గుహలోకి వెళ్లిన భూమన్ తీసుకొచ్చిన పులి పిల్ల కరుణాకర్ రెడ్డి. రాజకీయాల్లోనూ, వ్యక్తిగతంగానూ అనేకానేక సందర్భాలలో గాయపడిన కరుణాకర్ రెడ్డి ఆ పులి పిల్ల లక్షణాలను మాత్రం సజీవంగా కాపాడుకోవడానికి బహుశా అన్న భూమనే కారణం అనిపించింది వారిద్దరిని తిరుపతిలో జరిగిన సభలో ఆ వేదిక మీద చూసిన తర్వాత. దూరంగా ఉన్న వారికి ఇది అతిశయోక్తి కావచ్చు. ఆ సభలో ఉన్న వారికి మాత్రం వారిద్దరి మీద ఆసక్తి పెరిగి తీరుతుంది. మూడు తరాల భూమన్ పుస్తకం ఆవిష్కరణ జరిగిన సభలో అన్న భూమన్ దంపతుల కాళ్లకి తమ్ముడు కరుణాకర్ రెడ్డి సతీసమేతంగా నమస్కరించడం పెద్ద విషయంగా కనిపించదు. కానీ, అలా నమస్కరిస్తున్న మరిదిని కొడుకులా తన చేతులతో లేవనెత్తి అతని తలపై చేతులు వేసి ఆశీర్వదిస్తూ అక్కున చేర్చుకున్న వదినమ్మ కళ్లని ఆ సభలోనే గమనించాలి.

ఇంతా చేసి ఇదంతా వారి సొంత గొడవ కానే కాదు. ఇంతా చేసి ఇదంతా వారి కుటుంబ వ్యవహారం అస్సలు కానే కాదు. ఇదీ సామూహికమే. ఖలీల్ జీబ్రాన్ అన్నట్లు...

"ఒకరి పాత్రను మరొకరు నింపండి...
కానీ, ఒకే పాత్ర నుంచి ఇరువురు తాగవద్దు...." ఆ అన్నదమ్ములిద్దరూ అచ్చంగా ఇలాగే చేశారు.

" ఇద్దరూ కలిసి పాడండి, ఆడండి...
సంతోషంగా ఉండండి...
వేణువులోని రంధ్రాలు
ఒకే నాదంతో వణికినప్పటికీ వేటికవే ఉంటాయి..." అని జీబ్రాన్ అన్నట్లుగానే వారిద్దరు అలాగే ఉన్నారు. అవును... గుడి స్తంభాలు దూరంగానే ఉంటాయి... మర్రి చెట్టు, రావి చెట్టు ఒకదాని నీడలో మరొకటి పెరగవు. ఈ ఇద్దరు అన్నదమ్ములు ఇలాగే కనిపిస్తారు. ఇలాగే కనిపించాలి. వాళ్లే కాదు.... అన్నదమ్ములందరూ హృదయాలను ఇచ్చిపుచ్చుకోవాలి... కానీ ఒకరి ఏలుబడిలోకి మరొకరు చొరబడకూడదు.

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

కౌలు రైతులను దగాచేస్తున్న ప్రచారార్భాటం

పి.జమలయ్య

వ్యవసాయరంగం సంక్షోభంలోకి కూరుకుపోయింది. దేశంలో ప్రతి రోజూ 28మంది అన్నదాతలు ఆత్మహత్యలు చేస కుంటున్నారు. రైతాంగ ఆత్మహత్యల్లో మన రాష్ట్రం మూడో స్థానంలో, కౌలు రైతుల్లో రెండో స్థానంలో ఉంది. వీరిలోనూ చిన్న, సన్నకారు, కౌలు రైతులే ఎక్కువ. మారిన వ్యవసాయ పరిస్థితుల్లో కౌలు రైతులదే కీలకపాత్ర. కౌలు రైతులు లేనిదే వ్యవసాయం లేదు. సాగు చెయ్యని వారికి లక్షల కోట్లు సహాయం అందిస్తూ, వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు అన్యాయం చేస్తున్నారు. ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసిన వివరాలను పరిశీలిస్తే కౌలు రైతులకు ఎంత అన్యాయం జరుగుతుందో తెలుస్తోంది.

సీసీఆర్సీ కార్డులు పొందిన కౌలు రైతులకు గత నాలుగేళ్లుగా పంట రుణాలతోపాటు అన్నిరకాల సంక్షేమ ఫలాలను కౌలు రైతులకు ప్రభుత్వం అందజేస్తుందని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. 2019- 2020 సీజన్లో 2,72,720 మందికి, 2020 -2021లో 4, 14,770 మందికి, 2021 -2022 సీజన్లో 5,24,203 మందికి, 2023 -2024 సంవత్సరంలో చాలా పెద్ద సంఖ్యలో సీసీఆర్సీ కార్డులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కనీసం 8.81 లక్షల మందికి సీసీఆర్సీ కార్డులు జారీ చేయాలనే లక్ష్యంతో ఆర్బీకే కేంద్రాల ద్వారా సీసీఆర్సీ మేళాలు నిర్వహించారు. ఈ మేళాల ద్వారా కనీవినీ ఎరగని స్థాయిలో 7,77,417 మందికి కౌలు గుర్తింపు కార్డులు జారీ చేసామని వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ చేవూరి హరికిరణ్ తెలిపారు. కౌలు రైతులతో మేళాలు ఎక్కడ జరిగాయో కౌలు రైతులకు తెలియదు. కార్డులు పొందిన వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారు 4,51,545 మంది ఉండగా ఇతర వర్గాలకు చెందిన 3,25,872 మంది ఉన్నారు. జారీ చేసిన కౌలు గుర్తింపు కార్డుల్లో నూటికి సుమారు 50 శాతం కార్డులు బినామీ పేర్లతో పొందినవే ఎక్కువగా ఉన్నాయని సంఘం నిర్వహించిన సర్వేలో తేలింది. కృష్ణాజిల్లా కంకిపాడు మండలం గొడవర్రు గ్రామంలో ఈ సంవత్సరం 380 మందికి గుర్తింపు కార్డులు జారీచేస్తే అందులో బీసీలు 112, ఎస్సీలకు 76, ఓసీలకు 192 మందికి ఇచ్చారు. వాస్తవంగా ఓసీలలో 15 మందే కౌలు రైతులున్నారు. మిగిలిన 177 మంది కౌలు రైతులు కాదు. బినామీలు, భూయజమానులు. కౌలు రైతులకు కార్డులు ఇప్పించడానికి మనస్సు అంగీకరించక... తమ బంధువుల పేరుతో, కారు డ్రైవర్ల పేరుతో, ఇంట్లో పని చేసే వారి పేర్లమీద కార్డులు రాయించారు. వాస్తవంగా భూములు సాగుచేస్తున్న కౌలు రైతులకు కార్డులు ఇప్పించడానికి ముందుకు రావడంలేదు. లక్ష్యానికి మించి గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామని ప్రచారం నిర్వహించి బయట ప్రపంచాన్ని నమ్మబలుకుతోంది. 2016లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నియమించిన ప్రొఫెసర్ రాధాకృష్ణ కమిటీ అధ్యయనం ప్రకారం రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని తెలిపింది. వాస్తవాన్ని అంగీకరించ కుండా ఆ మొత్తం కౌలు రైతుల సంఖ్యను తగ్గించి కేవలం 16లక్షల మందే ఉన్నారని చెప్పటం కళ్లు ఉండి చూడలేని కబోదిలాగా

వ్యవహరించటం రాష్ట్ర ప్రభుత్వ కపటాన్ని విదితం చేస్తోంది. అంతేగాక గత ప్రభుత్వం నుంచిసులభంగా కార్డులు పొందిన కౌలు రైతులు.. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తెచ్చిన కౌలు రైతుల చట్టం వల్ల కార్డులు రావటం కనాకష్టంగా ఉంది.

పంట రుణాలు ఒక పెద్ద మోసం

ప్రతి ఏడాది ఇచ్చే పంట రుణాల్లో 10 శాతం ఇస్తామని లక్ష్యంగా పెట్టుకున్నారు. అంటే కనీసం రూ.10 వేల కోట్లు ఇవ్వాలి. నిర్ణయించుకున్న లక్ష్యానికి అనుగుణంగా ఏ సంవత్సరమూ ఇవ్వలేదు. పైగా లక్ష్యాన్ని తగ్గించుకుంటూ వచ్చారు. పంట రుణాలు కూడా లక్ష్యం ప్రకారం ఇచ్చిన దాఖలాలు లేవు. గత సంవత్సరం కనీసం రూ.4000 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఇదికూడా అమలు కాలేదు. నాలుగేళ్లలో 9 లక్షల మంది కౌలు రైతులకు రూ.6,668 కోట్లు పంట రుణాలు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. నాలుగేళ్ళలో ఒక్కొక్క రైతుకు రూ.74,088లు సంవత్సరానికి ఒక్కొక్క రైతుకు రూ.18,522లు ఇచ్చారు. ఒక ఎకరంలో వరి పండించడానికి కౌలు రైతుకు రూ.63వేలు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఇందులో నాలుగో వంతు కంటే తక్కువ ఇచ్చారు. కౌలు రైతు ఎన్ని ఎకరాలు సాగుచేసినా ఒక్కొక్కరికి రూ.50 వేలకు మించకుండా రుణం ఇవ్వాలని నిబంధనలు పెట్టారు. అంటే నిర్ణయించుకున్న మొత్తంలో మూడో వంతే ఇస్తున్నారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుండి కౌలు రైతులను ఆదుకున్నామని చెప్పటం విచిత్రంగా ఉంది.

వడ్డీ రాయితీలు అందని ద్రాక్ష

గత నాలుగేళ్లలో 30 వేల మందికి వడ్డీ రాయితీ క్రింద రూ.6 కోట్లు ఇచ్చారు. అంటే ఒక్కొక్క రైతుకు సంవత్సరానికి రూ.2000లు. అంటే ఏడాదికి రూ.500 చొప్పున వడ్డీ రాయితీ ఇచ్చామని వైఎస్ ఆర్సీపి ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటోంది. ఇంతకన్నా సిగ్గుచేటు మరొకటి లేదు.

కౌలు రైతులకు భరోసాలేని వైఎస్ఆర్ రైతు భరోసా

రాష్ట్రంలో సెంటు భూమిలేని కౌలు రైతులు 8 లక్షల నుంచి 10 లక్షల ఉంటారని గణంకాలు తెల్పుతున్నాయి. వీరిలోనూ ఎక్కువమంది పేద, బడుగు, బలహీన వర్గాలవారే. గత ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ పథకం ద్వారా సంవత్సరానికి రూ.15 వేలు ఇస్తామని వాగ్దానం చేసింది. ఈ లోపు ఎన్నికల జరిగాయి. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... రైతులతోపాటు ప్రతి కౌలురైతులకు సంవత్సరానికి రూ.13,500 ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. తీరా అతి కొద్ది మందికి పెట్టుబడి సాయం అందించి చేతులు దులుపుకుంటున్నారు. వైఎస్ఆర్ రైతుభరోసా కింద గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో సుమారు 3.92 లక్షల మందికి రూ.529 కోట్లు పెట్టుబడి అందించినట్లు చెప్పారు. ఈ సంవత్సరం ఇచ్చిన వాటిని కూడ కలుపుకున్నా ఇది పచ్చి అబద్ధం. ఎందుకంటే కౌలుగుర్తింపు కార్డులతో సంబంధంలేని అటవీ భూములు సాగుచేస్తున్న గిరిజన రైతులకు ఇచ్చిన వాటిని కూడా కలుపుకుని కౌలు రైతులకు రైతుభరోసా ఇస్తున్నామని పేర్కొనడం దారుణం. వాస్తవంగా చెప్పాలంటే ప్రతి సంవత్సరం 67వేల నుంచి 70వేల మందికే పెట్టుబడి సాయం అందిస్తున్నారు. రాష్ట్రం మొత్తంగా ప్రతి సంవత్సరం 58లక్షల మంది సాగుదారులకు రూ.7వేల కోట్లకు పైగా ఇస్తూ కౌలురైతులకు (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ)లకు మాత్రమే రూ.100 కోట్లు మించి రైతు భరోసా ఇవ్వడం లేదు. ఇతర సామాజిక వర్గాలను వదిలేశారు. రైతుల్లో కులాలుగా చూసి పెట్టుబడిసాయం అందించటం ఎంత వరకు సమంజసం. వారు అందించే సహాయం కూడా పావుఎకరం సాగుకు సరిపోదు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులను దృష్టిలో పెట్టుకొని, భూమిలేని కౌలు రైతులందరికి రైతు భరోసా అందించాలి.

\- ప్రకృతి విపత్తులు, చీడపీడలు వల్ల జరుగుతున్న నష్టానికి సహాయం ఏది? ప్రకృతి విపత్తుల వల్లనూ, చీడపీడల వల్లనూ కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక్కొక్క సందర్భంలో కనీసం పెట్టుబడీ రానిపరిస్థితి ఏర్పడుతోంది. ఈ నాలుగు సంవత్సరాల్లో పంటలు దెబ్బతిన్న 2.34 లక్షల మంది కౌలురైతులకు రూ.246 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అందజేశారు. ఒక్కొక్క రైతుకు రూ.10,512లు, అంటే ఏడాదికి ఒక్కొక్కరికి రూ.2,628లు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారు. ఇది విడ్డూరంగాఉంది. ఎకరానికి వరి పంటకు పెట్టిన పెట్టుబడిలో రెండు శాతం ఎంత దారుణమో. కనీసం పెట్టిన ఖర్చులు కూడా ఇవ్వని దౌర్భాగ్య పరిస్థితి.

పంటల బీమా పరిహారం భూయజమానులకు సమర్పయామి !

పంటల బీమా పరిహారం కింద గత నాలుగు సంవత్సరాల్లో రైతాంగానికి రూ.6,684 కోట్లు ఇచ్చామని ప్రభుత్వం గొప్పగా బాకా ఊదుతోంది. కౌలు రైతులకు మాత్రం 1.73 లక్షల మందికి రూ.487 కోట్ల బీమా పరిహారం ఇచ్చారు. ఒక్కొక్క రైతుకు రూ.28,150లు. గత నాలుగేళ్లలో ఒక్కొక్క రైతుకు సంవత్సరానికి ఇచ్చింది రూ.7037లు. రూ.6వేల కోట్లకు పైగా సాగు చెయ్యని భూ యజమానులకు దోచి పెట్టింది. కౌలు రైతుల నోట్లో మట్టి కొట్టింది. పంటలు అమ్ముకునే వెసులుబాటు లేదు. ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించే పరిస్థితి కూడాలేదు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం

పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేనా?

బొల్లిముంత సాంబశివరావు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై అధికార వైసీపీ ఒకవైపు, ప్రతిపక్ష పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ, వామపక్ష పార్టీలు సీపీఐ, సీపీఐ(ఎం) మరోవైపు విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకుంటూ ప్రాజెక్టు పూర్తికాకపోవటానికి కారణం మీరంటే మీరని విమర్శలు చేసుకుంటున్నాయిగానీ...ప్రాజెక్టు నిర్మాణాన్ని ముందుకు సాగనీయకుండా అడ్డపడుతున్న మోదీ ప్రభుత్వంపై సమిష్టిగా ఆందోళన చేద్దామన్న ఆలోచనే రావడం లేదు. రాష్ట్ర ప్రయోజనాలే వీటికి పట్టవు. రామపాదసాగర్ పేరు-పోలవరంపై ప్రాజెక్టు నిర్మాణం గురించి దశాబ్దాల తరబడి చర్చ సాగుతున్నది. బ్రిటిష్ వలసపాలనలో 1941లో నాటి నీటిపారుదల ముఖ్యకార్యదర్శి ఎల్.వెంకటకృష్ణయ్య అయ్యర్ పోలవరం సమీపంలో గోదావరిపై రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేశాడు. దీన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నివేదిక రూపొందించారు. ఈ రిజర్వాయర్‌కి రామపాదసాగర్ అని పేరు పెట్టారు. దీని నిర్మాణ వ్యయం రూ.129 కోట్లు. విశాఖపట్నం, తూర్పుగోదావరి అవసరాలకు నీటిని మళ్లించటం, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు సాగునీరు, తాగునీరు అందించటం, విజయవాడ నుంచి గుండ్లకమ్మ నది వరకు మరో 143 కిలోమీటర్ల కాలువ నిర్మాణం దీని ప్రధాన లక్ష్యం. రామపాద సాగర్ రిజర్వాయర్ గరిష్ఠ లోతు 428 అడుగులు, కుడికాల్వ పొడవు 209 కిలోమీటర్లు. విద్యుత్ ప్రాజెక్టు 150 మెగావాట్ల సామర్థ్యం.

రామపాదసాగర్ డిజైన్ పూర్తయినా నిర్మాణం ప్రారంభం కాలేదు. కట్టాల్సిన చోట లోతు ఎక్కువగా ఉండటం, అధిక వ్యయం వలన బ్రిటిష్ ప్రభుత్వం నిర్మాణానికి ముందుకు రాలేదు. మన దేశప్రజల ప్రయోజనాలు వలస పాలకులకు లేకపోవడం అందుకు కారణం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1953లో గోదావరికి వరదలు వచ్చాయి. ఎంతో నీరు వృథాగా సముద్రం పాలైంది. దీంతో గోదావరిపై రిజర్వాయర్ కట్టాలన్న ప్రతిపాదన మరలా తెరపైకి వచ్చింది. పోలవరం రిజర్వాయర్ కారణంగా ఒడిశా, మధ్యప్రదేశ్ (ఇప్పుడు చత్తీస్‌గఢ్) రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురవుతాయని, వాటికి ఆంధ్రప్రదేశ్ తగిన పరిహారం ఇవ్వాలని కోరాయి. 1976లో ప్రాజెక్టుకు సంబంధించి కొత్త ప్రతిపాదనలు వచ్చాయి. బచావత్ ట్రిబ్యునల్ అవార్డులో భాగంగా పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలు 1981లో ఒక ఒప్పందం చేసుకున్నాయి. దాని ప్రకారం పూర్తి నీటిమట్టం 150 అడుగులు ఉండేలా రిజర్వాయర్ నిర్మాణం జరగాలి. స్పిల్‌వే సామర్థ్యం 36 లక్షల క్యూసెక్కులు. 1981లో ఆనాటి ముఖ్యమంత్రి టి.అంజయ్య పోలవరానికి శంకుస్థాపన చేశారు. పరిశీలనల తర్వాత 1986లో తుది నివేదిక తయారుచేశారు. 1985-86 ధరల ప్రకారం ప్రాజెక్టు వ్యయం రూ.2,665 కోట్లుగా అంచనా వేసినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

ప్రాజెక్టు శంకుస్థాపన: 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మరుగునపడిన ప్రాజెక్టు మరలా వెలుగులోకి వచ్చింది. రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసి...దీని నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాజెక్టు లక్ష్యం గోదావరి డెల్టాలో 10.13 లక్షల ఎకరాలు, కృష్ణ, విశాఖ జిల్లాల్లో 13 లక్షల ఎకరాలకు సాగునీటిని స్థిరీకరించటం, కృష్ణా నదికి 80 టీఎంసీల నీటిని మళ్లించటం కోసం నదుల అనుసంధానం చేయటం, విశాఖపట్నంలోని పరిశ్రమలకు 23.47 టీఎంసీల నీటి సరఫరా, 540 గ్రామాల్లోని 28.50 లక్షల జనాభాకి నీటి సరఫరా, 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి. ఇక్కడ గమనించాల్సింది సాగు స్థిరీకరణ తప్ప అదనంగా సాగు భూమి ఉండదు. అదనపు సాగు లేక పోవటమే కాకుండా దాదాపు రెండులక్షల దాకా సాగు భూమిని సేకరించడం వలన ప్రాజెక్టు ప్రయోజనం ఏమిటని చాలా మంది సాగునీటి నిపుణులు అభిప్రాయం.

పోలవరం ప్రాజెక్టు మౌలిక స్వభావం: రామపాదసాగర్ నిర్మించటానికి ప్రతిపాదించిన ప్రాంతానికి రెండు కిలోమీటర్ల ఎగువున పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్నది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ప్రధానంగా మూడు భాగాలు ఉన్నాయి. 1. రిజర్వాయర్ 2. స్పిల్ వే 3. విద్యుత్ ఉత్పత్తి. ఈ ప్రాజెక్టు వలన ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎనిమిది మండలాల్లోని 222 పంచాయతీల్లోని 373 గ్రామాలు, లక్షా ఆరువేల కుటుంబాలు నీట మునుగుతాయి. ఆస్తులు, సంపద పోగొట్టుకుంటారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతాయి. డయాఫ్రమ్ వాల్ కట్టిన తర్వాత కాఫర్ డ్యాం కట్టాల్సి ఉంది. చంద్రబాబు ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ముందు కాఫర్ డ్యాంకట్టి తర్వాత డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి మట్టి, రాతి కట్టలు నిర్మించింది. గోదావరి వరదల్లో ఈ కట్టడం తెగిపోవటం వలన అనేక గ్రామాలు ముంపునకుగురై ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ తప్పిదమే అయినా కేంద్ర జలసంఘం బాధ్యత కూడా ఉంది. డయాఫ్రమ్ వాల్ తెగిపోవటం వలన అనేక గ్రామాలు ముంపునకు గురై తీవ్రంగా ప్రజలు నష్టపోయారు. తిరిగి దాన్ని నిర్మించాల్సి ఉంది. ఇందుకు రెండువేల కోట్ల దాకా ఖర్చుకానుంది. ప్రాజెక్టు పనులకు అంతరాయం ఏర్పడింది.

పునరావాస సమస్య: ప్రాజెక్టు నిర్మాణం వలన 371 ఆవాసాలకు చెందిన



1,05,601 కుటుంబాలు ప్రభావితమవుతాయి. 2021 జూన్ వరకు 3,922 కుటుంబాలకు పునరావాసం కల్పించబడింది. అందుకు రూ.6,371 కోట్లు వ్యయం చేశారు. పునరావాసానికి ఇంకా రూ.26,796 కోట్లు అవసరమని డీపర్ అంచనాగా ఉంది. 2007 నుంచి 2021 వరకు 10 శాతం మాత్రమే పునరావాసం కల్పించారు. ఈ పునరావాస గృహాలు కూడా నాణ్యత లేక వర్షాలకు నీరుకారుతూ నివాసానికి సమస్యగా మారాయి. కేంద్రం ఆమోదించిన తొలిదశ ఎత్తు ప్రకారం కాంటూరు పరిధిలోనే 123 గ్రామాలు ముంపునకు గురికావటంతో 20,946 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉంది. ఇటీవల నిర్వహించిన హైడర్ సర్వేలో మరో 36 గ్రామాలు ముంపునకు గురవుతాయని తేలింది. ఆ గ్రామాల కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉంది. పునరావాసం కల్పించకుండా గ్రామాలను ఖాళీ చేయించటాన్ని ప్రజలు ముఖ్యంగా గిరిజన ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించాకే పోలవరం ప్రాజెక్టులో నీటిని నిల్వచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం ఆదేశించింది. పునరావాసానికి అవసరమైన నిధులు అందిస్తే త్వరితగతిన పునరావాస సమస్యను పరిష్కరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నది. నిధులు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని పునరావాసంకల్పించమని కేంద్రం ఎలాచెబుతున్నది. పునరావాసానికి కేటాయించిన మొత్తంతోపాటు మరో రూ.5,127 కోట్లు పునరా వాసం కల్పించేదుకు ఇవ్వాలని వైసీపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

నిధుల కేటాయింపు: చంద్రబాబు కోరిక మేరకు నీతి ఆయోగ్ సిఫార్సుల ప్రకారం 2016 సెప్టెంబర్ 30న పోలవరం నిర్మాణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అప్పగించింది. జాతీయ ప్రాజెక్టు కాకముందు పోలవరం ప్రాజెక్టు (2007)తొలి అంచనా ఖర్చు రూ.10,151 కోట్లు. సవరించిన అంచనా (2010) రూ.16,010.45 కోట్లు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించక ముందు 2017 జనవరి నాటికి ప్రాజెక్టు కోసం రూ.8,898 కోట్లు ఖర్చుపెట్టారు. చంద్రబాబు ప్రభుత్వం ఖర్చు పెట్టింది రూ.3,349.70 కోట్లు. 2014 జనవరినాటి అంచనాల ప్రకారం ప్రాజెక్ట్ వ్యయాన్ని పూర్తిగా కేంద్రం భరిస్తానని చెప్పింది. దాని ప్రకారం పోలవరం ప్రాజెక్టు వ్యయం రూ.20,398 కోట్లు. ఇప్పటి వరకు కేంద్రం ఇచ్చింది రూ.14,418 కోట్లు. 2017-18 డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్టు నివేదిక) ప్రకారం కేంద్ర సాంకేతిక కమిటీ ఆమోదించిన ప్రాజెక్టు ఖర్చు రూ.55,656.87 కోట్లు. కేంద్ర రివైజ్డు కాస్ట్ కమిటీ ఆమోదించింది మాత్రం రూ.47,625.24 కోట్లు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం రూ.58వేల కోట్లు ఖర్చు వివరాలను కేంద్రానికి తెలిపింది. అయితే ప్రాజెక్ట్ నిర్మాణం ఖర్చునే ఇస్తానని, పునరావాసఖర్చు ఇవ్వబోమని కేంద్రం అంటున్నది. పోలవరం ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్లు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుంటే, కేంద్ర ప్రభుత్వం మొదటిదశలో 41.15 మీటర్లకే ఆమోదం తెలిపింది. ఈ ఎత్తులో నిర్మాణం జరిగితే ప్రాజెక్టు ప్రయోజనకరంగా ఉండదు. జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినప్పుడు అన్ని ఖర్చులు కేంద్రమే భరించాలి. ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేయకపోవటం వలన వేలాది కోట్ల వ్యయం పెరిగింది. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణం. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై వైసీపీ, టీడీపీ వత్తిడి చేయకుండా... ప్రాజెక్టు నిర్మాణ జాప్యానికి నీవు కారణమంటే నీవని తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకుంటున్నాయి. దీన్ని గమనిస్తే ప్రాజెక్టు నిర్మాణం కన్నా ఈ రెండు పార్టీలకు రాజకీయ ప్రయోజనమే ప్రధానంగాఉంది. పోలవరం ప్రాజెక్టును రైతాంగం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా సాగు, తాగునీరు అందేలా చూడాలని, ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో ఉన్నసమస్యలను పరిష్కరించుకోవాలని, నిర్వాసితులకు సక్రమమైన పునరావాసం కల్పించాలని, భూమి నివాస ప్రాంతాల్లోనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలి.

సెల్: 9885983526

మోదీ సర్కార్‌లో కలవరం

- దర్యాప్తు సంస్థలతో కక్షపూరిత దాడులు పెరుగుతాయి
- రాజ్యాంగ సంస్థలను బీజేపీ నియంత్రించాలనుకుంటోంది
- ఈ దేశ ప్రజలే మా ఆశాకిరణం
- 'ఇండియా' కూటమి భేటీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

ముంబై: ప్రతిపక్ష కూటమి బలం ప్రభుత్వానికి 'ఆందోళన' కలిగిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుక్రవారం అన్నారు. 'ఇండియా' కూటమి భాగస్వాములకు వ్యతిరేకంగా ఈ ప్రభుత్వం ప్రతీకార రాజకీయాల్లో భాగంగా దర్యాప్తు సంస్థలను 'దుర్వినియోగం' చేసే అవకాశం ఉన్నందున...వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఇక్కడ జరిగిన ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సమావేశంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శల దాడి చేశారు. తొమ్మిదేళ్లుగా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వ్యాప్తిజేసిన మతపరమైన విషం ఇప్పుడు అమాయక రైలు ప్రయాణికులు, పాఠశాల విద్యార్థులపై జరిగిన విద్వేషపూరిత నేరాలలో కనిపిస్తోందని తెలిపారు. రైల్వే పోలీసు కానిస్టేబుల్ రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తులను కాల్చి చంపిన సంఘటన, ముజఫర్‌నగర్ పాఠశాలలో ముస్లిం విద్యార్థి తన హోం వర్క్ పూర్తి చేయనందుకు అతని సహ విద్యార్థులతో చెప్పుతో కొట్టమని టీచరు కోరడం వంటి ఘటనలను ఆయన ప్రస్తావించారు. పాట్నా, బెంగళూరులో జరిగిన రెండు సమావేశాల విజయాన్ని ఖర్గే తన ప్రారంభ వ్యాఖ్యలలో, ప్రధానమంత్రి తన తదుపరి ప్రసంగాలలో 'ఇండియా' కూటమిపై దాడి చేయడమే కాకుండా 'మన ప్రియమైన దేశం పేరును ఉగ్రవాద సంస్థ, బానిసత్వ చిహ్నం'తో పోల్చారని అన్నారు. 'ఈ ప్రభుత్వ ప్రతీకార రాజకీయాల కారణంగా రానున్న నెలల్లో మరిన్ని దాడులకు, అరెస్టులకు మనం సిద్ధంగా ఉండాలి. మన కూటమి ఎంత పుంజుకుంటే అంతగా బీజేపీ ప్రభుత్వం మన నేతలపై దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తుంది' అని ఖర్గే ఆరోపించారు. మహారాష్ట్ర, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లోనూ అదే పని చేసింది. వాస్తవానికి గతవారం జార్ఖండ్, చత్తీస్‌గఢ్‌లోనూ అదే జరిగిందని అన్నారు. మన సమాజంలోని ప్రతి వర్గం... రైతులు, యువత, మహిళలు, అట్టడుగు వర్గాలు, మధ్యతరగతి, ప్రజా మేధావులు, స్వచ్ఛంద సంస్థలు, జర్నలిస్టులు కూడా బీజేపీ 'అధికార దుష్పరిపాలన'నకు ముగింపు పలకాలని కోరుకుంటున్నారని అన్నారు. 140 కోట్ల మంది భారతీయులు తమ కష్టాల నుంచి విముక్తి పొందాలనే ఆశతో మనవైపు చూస్తున్నారని ఆయన అన్నారు. 'దేశంలోని ఒక ప్రాంతంలో భయంకరమైన అత్యాచారానికి పాల్పడిన వ్యక్తులను విడుదల చేసి సత్కరించడమనేది భయంకరమైన నేరాలను ప్రోత్సహిస్తుంది. మరొకటి నగ్నంగా మహిళలను ఊరేగించడంలో ఆశ్చర్యం లేదు. మోదీ జీ భారతదేశంలో కార్గిల్ ధైర్య హృదయం ఉన్న భార్యను కూడా విడిచిపెట్టలేదు. అణగారిన వర్గాల పట్ల బీజేపీ ప్రభుత్వ ఉదాసీనత వల్లనే వారి నాయకులు పేద గిరిజనులు, దళితులపై మూత్ర విసర్జన చేసేలా చేస్తుంది. దోషులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు' అని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అదుపులో ఉంచాలని కోరుకుంటోందని, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు జాతీయ ఉపాధి హామీ పథకం బకాయిలు ఇవ్వడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు ప్రత్యేక నిధులు, రాష్ట్ర నిర్దిష్ట నిధులు విడుదల కావడం లేదని, పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను, ప్రాజెక్టులను ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల నుంచి బీజేపీ పాలిత రాష్ట్రాలకు తరలించవలసి వస్తుంది అని ఆయన ఆరోపించారు. అదానీ అంశాన్ని లేవనెత్తుతూ, రాహుల్ గాంధీ ఇక్కడ విలేకరుల సమావేశం నిర్వహించి ఆ వ్యాపార సంస్థ వాటాల తారుమారు వ్యవహారంపై ప్రధాని మోదీ మౌనాన్ని ప్రశ్నించారని, మారిషస్‌కు చెందిన కంపెనీ నుంచి రౌండ్ ట్రిప్పింగ్, అపారదర్శక పెట్టుబడులకు సంబంధించిన ఆరోపణలపై జేపీసీ విచారణకు డిమాండ్ చేశారని తెలిపారు. ఈ అంశంపై ప్రధాని ఎందుకు విచారణ జరపడం లేదంటూ ఆయన ప్రశ్నించారు. దర్యాప్తు సంస్థలు, సంస్థలపై పూర్తి నియంత్రణను బీజేపీ కోరుకుంటోందని, ఈడీ చీఫ్, సీబీఐ డైరెక్టర్, ఎన్నికల కమిషనర్లు లేదా దేశవ్యాప్తంగా ఉన్న కోర్టుల న్యాయమూర్తుల నియామకాన్ని నియంత్రించడంపై పట్టుదలగా ఉందని ఆయన తెలిపారు. 'మూడు సమావేశాల సమయంలో 'ఇండియా' కూటమి ఐక్య కూటమిగా పార్లమెంటు లోపల, వెలుపల ప్రభుత్వాన్ని విజయవంతంగా జవాబుదారీగా చేసింది. మా బలం ప్రభుత్వాన్ని కలవరపెడుతుంది' అని ఖర్గే అన్నారు. అందుకే పార్లమెంటులో ముఖ్యమైన బిల్లులను మరింత బుల్‌డోజ్ చేసి, మా ఎంపీలను బలహీన కారణాలతో సస్పెండ్ చేసి, మాపై ప్రివిలేజ్ మోషన్‌లు వేసి, మా మైక్‌లను నిలిపివేసి, మా నిరసనలను ప్రసారం చేయడానికి కెమెరాలను అనుమతించడం లేదని, సంసద్ టీవీలో మా ప్రసంగాలను నిర్మొహమాటంగా సెన్సార్ చేశారని ఆయన ఆరోపించారు. 'ఈ దేశ ప్రజలే మా ఆశాకిరణం' అంటూ ఖర్గే తన ప్రసంగాన్ని ముగించారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ నీరజ్ చోప్రా, యువ చెస్ మాంత్రికుడు ప్రజ్ఞానానందపై ప్రశంసలు కురిపించడమే కాకుండా చంద్రయాన్-3 విజయాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశంసించారు. రేపటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన వారందరికీ అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు.

నిరంకుశ సర్కార్ నిష్క్రమణ ప్రారంభమైంది

కేంద్రంలో మోదీ నేతృత్వంలోని 'నిరంకుశ ప్రభుత్వం' కు నిష్క్రమణ ప్రారంభమైందని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' అనే అవకాశాలను అన్వేషించడానికి ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో పాలకులు ప్రజలపై ఎన్ని మళ్లింపులు, పరధ్యానాలు విసిరినా, వారు ఇకపై మోసపోబోరని తెలిపారు. 'ఒక దేశం-ఒకే ఎన్నికలు' కు సంబంధించి సాధ్యాసాధ్యాలను అన్వేషించడానికి ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. లోక్‌సభ ఎన్నికలను రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలతో కలిసి నిర్వహించే అవకాశం ఉంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ సర్కార్‌ను గద్దె దించేందుకు కార్యచరణ ఖరారు చేసేందుకు ఇక్కడ సమావేశమైన 'ఇండియా' కూటమి నేతల బృందం ఫొటోను ట్యాగ్ చేస్తూ, ఖర్గే 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో, 'జుడేగా భారత్ (భారత్ కలుస్తుంది), జీతేగా ఇండియా (భారత్ గెలుస్తుంది), ప్రగతిశీల, సంక్షేమ ఆధారిత, సమ్మిళిత భారతదేశం కోసం మేము ఐక్యంగా ఉన్నాము. 'పాలక పాలన ప్రజలపై ఎన్ని మళ్లింపులు, పరధ్యానాలు విసిరినా, భారత పౌరులు ఇకపై మోసపోరు' అని అన్నారు.

రూ.2వేల నోట్లు 93 శాతం బ్యాంకులకు తిరిగొచ్చాయ్: ఆర్‌బీఐ

ముంబై: చలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 93 శాతం బ్యాంకులకు తిరిగొచ్చాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం వెల్లడించింది. వీటి విలువ రూ.3.32 లక్షల కోట్లని వెల్లడించింది. ఇంకా రూ.0.24 లక్షల కోట్లు విలువ చేసే రూ.2,000 నోట్లు ప్రజల దగ్గర ఉన్నాయని పేర్కొంది. తిరిగొచ్చిన నోట్లలో 87 శాతం డిపాజిట్ల రూపంలోనే వచ్చాయని ఆర్‌బీఐ తెలిపింది. మిగిలిన వాటిని ప్రజలు బ్యాంకుల్లో తక్కువ విలువ గల నోట్లలోకి మార్చుకున్నారని పేర్కొంది. రూ.2,000 నోట్లను చలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్‌బీఐ ఈ ఏడాది మే 19న ప్రకటించిన విషయం తెలిసిందే. 'క్లీన్ నోట్ పాలసీ'లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మే 24న మాట్లాడుతూ రూ.2,000 నోట్లు పెద్దగా వినియోగంలో లేవని తెలిపారు. అందుకే నోట్ల ఉపసంహరణ వల్ల అంతగా ఇబ్బందులు ఉండకపోవచ్చునని వివరించారు. నోట్లను మార్చుకోవడం లేదా ఖాతాలో డిపాజిట్ చేసుకోవడానికి సెప్టెంబరు 30 వరకు అవకాశం ఇచ్చింది. ఈ నెలతో గడువు ముగియనున్న నేపథ్యంలో ఇంకా రూ.2,000 నోట్లు ఉన్నవారు వెంటనే మార్చుకోవాలని ఆర్‌బీఐ సూచించింది.

భారతీయులంతా హిందువులే!

నాగపూర్‌లో మోహన్ భగవత్ వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: భిన్నత్వంలో ఏకత్వానికి భారత్ ప్రతీక. భిన్న మతాలు, వర్గాలు, భాషలు, సంస్కృతులకు ఇది నిలయం. భాషలు, వేషధారణ, ఆచారాలు, సంప్రదాయాలు వేరైనా అన్ని మతాల వారు కలిసిమెలిసి ఉంటారు. వీరంతా సోదరుల్లా మెలగడంతో కాషాయ వర్గం కన్నుకుట్టింది. దేశాన్ని మతం పేరిట విభజించాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) కంకణం కట్టుకుంది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చాక మరింతగా రెచ్చిపోతూ హిందూత్వ ప్రచారాన్ని హోరెత్తిస్తోంది. భారత్‌ను హిందూ రాష్ట్ర (హిందూ దేశం)గా అభివర్ణిస్తోంది. భారతీయులను హిందువులుగా వ్యవహరిస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్ తాజాగా 'దైనిక్ తరుణ్ భారత్' వార్తాపత్రికను నడిపే శ్రీ నర్కేశరి ప్రకాశన్ లిమిటెడ్‌కు చెందిన నాగపూర్‌లోని కొత్త భవనం 'మధుకర్ భవన్' ప్రారంభోత్సవం సందర్భంగా కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ 'హిందుస్తాన్ ఒక హిందూ దేశం. ఇదే నిజం. సైద్ధాంతికంగా భారతీయులంతా హిందువులు. హిందువులంటే భారతీయులే. నేడు భారతదేశంలో ఉన్నవారంతా హిందూ సంస్కృతికి, వారసత్వానికి ఎంతో కొంత సంబంధం కలిగిఉన్నవారే. ఈ విషయాన్ని కొందరు అర్థం చేసుకున్నారు. మరికొందరు అర్థమైనాగానీ అలవాట్లు, స్వార్థపూరిత కారణాలతో ఆచరించడం లేదు. ఇంకొందరు దానిని అర్థం కాకుండానైనా ఉండాలి లేక మర్చిపోయి ఉండాలి' అని వ్యాఖ్యానించారు. వార్తా సేకరణకూ మతం రంగు పులిమే ప్రయత్నం చేశారు. మన భావజాలానికి (హిందూత్వను ఉద్దేశించి) చెక్కు చెదరనివ్వకుండా వాస్తవాధారంగా, న్యాయంగా రిపోర్టింగ్ చేయాలన్నారు. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా తమ భావజాలానికి ఆచరణ ఉందని, దీనికి ప్రత్యామ్నాయమే లేదంటూ గొప్పలు పోయారు. ఈభావజాలాన్ని విశ్వవ్యాపితం చేసే బాధ్యత దేశం, సమాజం, సంబంధిత మీడియాపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ, స్వదేశీపై దృష్టి, కుటుంబ విలువులు కాపాడుకోవడం, క్రమశిక్షణ పాటించడం వంటివాటిపై దృష్టి పెట్టాలని కూడా సూచించారు.

నాగపూర్ వర్సిటీ ఎంఏ సిలబస్‌లో రామజన్మభూమి ఉద్యమం, బీజేపీపై పాఠాలు

న్యూఢిల్లీ: నాగ్‌పూర్ యూనివర్సిటీ (ఎన్‌యూ) ఎంఏ చరిత్ర సిలబస్‌లో సీపీఐ (ఎం) అధ్యాయాన్ని తొలగించి 'రామజన్మభూమి ఉద్యమం', బీజేపీలను చేర్చడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనసంఘ్‌లోని విభాగాలు, అలాగే గతంలోని రిపబ్లికన్ పార్టీ అధ్యాయాన్ని యథావిధిగా ఉంచింది. అయితే కాంగ్రెస్ మిత్రపక్షం డీఎంకే స్థానంలో బీజేపీ మిత్రపక్షం అన్నాడీఎంకేను చేర్చింది. ఖలిస్తాన్ ఉద్యమంలో ఓ అధ్యాయాన్ని తొలగించినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదించింది. 'ఇండియన్ మాస్ మూవ్‌మెంట్స్ ఫ్రమ్ 1980-2000' లో రామజన్మభూమి ఉద్యమాన్ని చేర్చింది. గతంలోనూ సిలబస్‌ను మార్చి వివాదాలు ఎదుర్కొంది.

2019లో నాలుగో సెమిస్టర్ కోసం సూచించిన బీఏ చరిత్ర సిలబస్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)ను చేర్చిన సంగతి తెలిసిందే. ఈ నూతన సిలబస్‌ను ఎన్‌యూ బోర్డ్ ఆఫ్ స్టడీస్ (హిస్టరీ) చైర్మన్ శ్యామ్ కొరెట్టి రూపొందించారు. 'సీపీఐ(ఎం) జాతీయ పార్టీ కానందున... జాతీయ స్థాయిలో పట్టు గల బీజేపీని సిలబస్‌లో భాగం చేశామని, కేవలం 2010 వరకు మాత్రమే బీజేపీ చరిత్రను చేర్చామని కొరెట్టి చెప్పారు. తాము విద్యార్థులకు తప్పుడు విషయాలు బోధించడం లేదని పేర్కొన్నారు. నూతన విద్యా విధానానికి కట్టుబడి ఈ ఏడాది ఎన్‌యూ సిలబస్ ఉండాలని అన్నారు. మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీలకు సంబంధించిన అంశాలను చేర్చామని తెలిపారు.

సిలబస్ మార్పుపై అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వడెట్టివార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ తన సిద్ధాంతాలైన మతతత్వం, కులతత్వపు విద్వేషపు భావజాలాన్ని ప్రజలపై రుద్దుతోందని మండిపడ్డారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించిన బీజేపీ మహిళలను గౌరవించదని, ఇక బీజేపీ విద్యార్థులకు ఏమి బోధిస్తుందని ధ్వజమెత్తారు.

దేవెగౌడ మనవడికి షాక్

ప్రజ్వల్ ఎన్నిక చెల్లదని హైకోర్టు తీర్పు

బెంగళూరు: కర్నాటకలో జేడీఎస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. లోక్‌సభ ఎంపీగా మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు, జేడీఎస్ నేత ప్రజ్వల్ రేవణ్ణ ఎన్నిక చెల్లదని కర్నాటక హైకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ సందర్భంగా ఆయన తప్పుడు వివరాలతో అఫిడవిట్ దాఖలు చేసినట్లు కోర్టు ధ్రువీకరించింది. ఆయన వచ్చే ఆరేళ్ల పాటు ఎలాంటి ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత విధిస్తున్నట్లు హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం తీర్పు చెప్పింది. 33 ఏళ్ల ప్రజ్వల్ ప్రస్తుత పార్లమెంట్‌లో మూడో అతి పిన్న వయస్కుడైన నేతగా గుర్తింపు పొందారు. లోక్‌సభలో జేడీఎస్ తరఫున ఉన్న ఏకైక ఎంపీ ఆయన. కర్నాటక మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ కుమారుడు ప్రజ్వల్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో హసన్ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అయితే, ఆ ఎన్నికల్లో ప్రజ్వల్ తప్పుడు వివరాలతో అఫిడవిట్ సమర్పించారని ఆరోపిస్తూ రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. హసన్ నియోజకవర్గ ఓటరు జి.దేవరాజెగౌడ, ఆ స్థానం నుంచి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి ఎ.మంజు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు... ప్రజ్వల్ రేవణ్ణ అఫిడవిట్‌లో తన ఆస్తులను పూర్తిగా వెల్లడించకుండా ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడ్డారని ధ్రువీకరించింది. అందువల్ల ఎంపీగా అతడి ఎన్నిక చెల్లదని తీర్పు చెప్పింది. అయితే, ప్రజ్వల్ అనర్హతతో హసన్ నుంచి తనను ఎంపీగా ప్రకటించాలని మంజు చేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. మంజు సైతం అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటుండటంతో హసన్ స్థానం నుంచి అతడు ఎన్నికైనట్లు ప్రకటించలేమని స్పష్టం చేసింది. ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడినందుకు గానూ ప్రజ్వల్ తండ్రి రేవణ్ణ, సోదరుడు సూరజ్‌పైనా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశించింది. ప్రజ్వల్ 2019లోనే తొలిసారి ఎన్నికల్లో పోటీ చేశారు. మనవడి కోసం దేవెగౌడ తన కంచుకోట అయిన హసన్ స్థానాన్ని త్యాగం చేసి తుముకూరు నుంచి పోటీ చేశారు. అయితే అక్కడ ఆయన ఓటమిపాలయ్యారు. ఆ ఎన్నికల్లో జేడీఎస్ ఆరు స్థానాల్లో పోటీ చేయగా... ప్రజ్వల్ మినహా ఎవరూ గెలవలేదు. ఇదిలా ఉండగా.. ప్రజ్వల్‌కు వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్ వేసిన మంజు...ఆ తర్వాత బీజేపీని వీడి జేడీఎస్‌లో చేరారు. ప్రస్తుతం జేడీఎస్ తరఫున ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

'మహేంద్ర గిరి' యుద్ధనౌక జలప్రవేశం

ముంబై: భారత నౌకాదళం అమ్ములపొదిలో మరో యుద్ధ నౌక చేరింది. మజాగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్) అభివృద్ధి చేసిన భారత నౌకాదళానికి చెందిన మహేంద్రగిరి యుద్ధనౌకను శుక్రవారం ముంబైలో జల ప్రవేశం చేసింది. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, భార్య సుదేష్ ధన్కర్ ముంబైలోని మజాగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్‌లో దీనిని ప్రారంభించారు. ఇండియన్ నేవీ ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపింది. భారత నౌకాదళ స్వావలంబన, దేశం సాధించిన అద్భుతమైన పురోగతికి యుద్ధ నౌక మహేంద్రగిరి ప్రారంభం నిదర్శనమని అందులో పేర్కొంది. అధునాతన ఆయుధాలు, సెన్సార్లు, ప్లాట్‌ఫామ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ వంటి అభివృద్ధి చెందిన వ్యవస్థలు ఈ ఆధునాతన యుద్ధ నౌకలో ఉంటాయని వెల్లడించింది. కాగా, ప్రాజెక్ట్ 17ఏ (శివాలిక్ క్లాస్ ఫ్రిగేట్)లో భాగంగా ముంబైలోని మజాగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్‌లో నాలుగు, కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్‌లో మిగతా 13 యుద్ధ నౌకలను నిర్మిస్తున్నారు.

నవ్‌లఖా ఆరోగ్యంపై నివేదిక ఇవ్వండి

ఎన్‌ఐఏకి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: ఎల్గార్ పరిషత్-మావోయిస్టు సంబంధాల కేసులో హక్కుల కార్యకర్త గౌతమ్ నవ్‌లఖాను గృహనిర్బంధంలో ఉంచడం తప్పుడు సంకేతం ఇచ్చినట్లవుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి, కేసు విచారణ ఏ దశలో ఉందో తెలియజేయాలని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)ను శుక్రవారం సుప్రీం కోర్టు ఆదేశించింది. నాలుగు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని న్యాయమూర్తులు ఎంఎం సుందరేశ్, జేబీ పార్దివాలా ధర్మాసనం... ఎన్ఐఏ తరఫున కోర్టుకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజును ఆదేశించింది. 'సహజంగా మాకు పరిమితులున్నాయి. కానీ కేసు మెరిట్‌లోకి వెళ్లకుండా సుదీర్ఘ ఉత్తర్వు ఇచ్చాను. ఇది తప్పుడు ఉదాహరణను సెట్ చేయవచ్చు. మీకు 100% మెరిట్ ఉండవచ్చు, దాని గురించి ఏమీ చెప్పలేదు. కానీ దీన్ని సులభతరం చేయడానికి, ఒక వ్యక్తి కోసం దీన్ని చేయండి... అఫిడవిట్ దాఖలు చేయండి. అందులో ఈ వ్యక్తి ప్రస్తుత పరిస్థితి, విచారణ దశ కూడా ఉండాలి' అని ధర్మాసనం మౌఖికంగా పేర్కొంది. నవంబర్ 2022 నుంచి నవ్‌లాఖా ముంబైలోని ఓ పబ్లిక్ లైబ్రరీలో గృహ నిర్బంధంలో ఉన్నారు. విచారణ ప్రారంభం కాగానే, నవ్‌లాఖా తరఫు న్యాయవాది నిత్యా రామకృష్ణన్ మాట్లాడుతూ... వసతిని మార్చాలని కోరుతూ కార్యకర్త చేసిన పిటిషన్‌పై ఏప్రిల్‌లో సమాధానం దాఖలు చేయాలని సుప్రీం కోర్టు ఎన్ఐఏని ఆదేశించినప్పటికీ ఇప్పటి వరకు తన ప్రతిస్పందనను సమర్పించలేదని పేర్కొన్నారు. కార్యకర్త బెయిల్ పిటిషన్‌ను బాంబే హైకోర్టు విచారించాల్సి ఉందని, సమయం కావాలని ధర్మాసనానికి తెలిపారు. సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు మాట్లాడుతూ... నవ్‌లాఖాను గృహనిర్బంధంలో ఉంచడం అసాధారణమైన ఉత్తర్వు అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇలాంటి కేసుల్లో బహుశా ఇదే మొదటిదన్నారు. 'ఆయన అనారోగ్యం కారణంగా హౌస్ ఆర్డర్ పొందారు. ఒక మహిళ ఆయనకు తోడుగా ఉంటుందని చెప్పారు. కానీ ఆమె ఎక్కువ సమయం ఉండడం లేదు' అని రాజు తెలిపారు. హౌస్ అరెస్ట్ ఆర్డర్ అసంబద్ధమని స్పష్టం చేశారు. నవ్‌లాఖా భద్రత కోసం పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచడానికి ఖర్చుల నిమిత్తం కనీసం రూ. 20 లక్షలు చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని ధర్మాసనాన్ని కోరారు. అయితే ఎన్ఐఏ చేయించిన వైద్య పరీక్షలో నవ్‌లాఖా అనారోగ్యం నిర్ధారించబడిందని రామకృష్ణన్ పేర్కొన్నారు. గత ఏడాది నవంబర్ 10న నవ్‌లాఖాను గృహనిర్బంధానికి ఆదేశించిన సుప్రీంకోర్టు... ఇందుకోసం గృహ నిర్బంధం చేసిన చోట పోలీసు సిబ్బందిని మోహరించినందుకు రాష్ట్రం భరించే ఖర్చులకు గాను రూ.2.4 లక్షలు డిపాజిట్ చేయాలని ఆదేశించింది. గత విచారణలో, నవ్‌లాఖా... తన భద్రత కోసం పోలీసు సిబ్బందిని నియోగించడానికయ్యే ఖర్చుకు గాను మరో రూ.8 లక్షలు డిపాజిట్ చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించి నవీ ముంబైలోని తలోజా జైలులో ఉన్న నవ్‌లాఖా ఆరోగ్యం క్షీణించడంతో నవంబర్ 10, 2022 న, గృహనిర్బంధంలో ఉంచడానికి సుప్రీంకోర్టు అనుమతించింది.

శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు మోదీ అభినందన



న్యూఢిల్లీ: గుజరాత్‌లోని కక్రాపర్‌లో దేశీయంగా అభివృద్ధి చేసిన మొట్టమొదటి 700 మెగావాట్ల అణు విద్యుత్ కేంద్రం పూర్తి సామర్థ్యంతో కార్యకలాపాలు ప్రారంభించిందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. కక్రాపర్ అటామిక్ పవర్ ప్రాజెక్ట్ (కేఏపీపీ)లోని రియాక్టర్ జూన్ 30 న వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించింది. అయితే ఇప్పటి వరకు దాని సామర్థ్యంలో 90 శాతం వరకు మాత్రమే పనిచేస్తోంది. 'భారతదేశం మరో మైలురాయిని సాధించింది. గుజరాత్‌లోని మొట్టమొదటి అతిపెద్ద స్వదేశీ 700 మెగావాట్ల కక్రాపర్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ యూనిట్-3 పూర్తి సామర్థ్యంతో కార్యకలాపాలు ప్రారంభించింది. మన శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు అభినందనలు' అని 'ఎక్స్'లో ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. అణు విద్యుత్ ప్లాంట్ల అభివృద్ధి శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల కృషిని మోదీ కొనియాడారు. కేఏపీపీ కక్రాపర్ వద్ద రెండు 700 మెగావాట్ల ప్రెషరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్‌లను (పీహెచ్‌డబ్ల్యూఆర్) నిర్మిస్తోంది. ఇక్కడ రెండు 220 మెగావాట్ల పవర్ ప్లాంట్‌లు కూడా ఉన్నాయి. ఇక కేఏపీపీ దేశవ్యాప్తంగా పదహారు 700 మెగావాట్ల పీహెచ్‌డబ్ల్యూఆర్‌లను నిర్మించాలని యోచిస్తోంది. ఇందుకోసం ఆర్థిక, పరిపాలనా అనుమతులను మంజూరయ్యాయి. రాజస్థాన్‌లోని రావత్‌భటా (ఆర్ఏపీఎస్ 7, 8), హరియాణాలోని గోరఖ్‌పూర్‌లో (జీహెచ్‌ఏవీపీ 1, 2) 700 మెగావాట్ల అణు విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం జరుగుతోంది.

కమిటీ ఏర్పాటు అప్రజాస్వామికం: సీపీఎం

కోల్‌కతా: 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' సాధ్యాసాధ్యాల అన్వేషణకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయడం పూర్తిగా అప్రజాస్వామికమని సీపీఎం శుక్రవారం పేర్కొంది. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సుజన్ చక్రవర్తి మాట్లాడుతూ...ఇలాంటి చర్యల వల్ల భిన్నత్వంలో ఏకత్వం అనే భావనకు తూట్లు పొడిచినట్లేనన్నారు. ఇలాంటి కమిటీ ఏర్పాటు చేయడం ఎంతమాత్రం ప్రజాస్వామ్యం కాదన్నారు. కాంగ్రెస్, వామపక్షాలతో సహా అనేక ప్రతిపక్ష పార్టీలతో భారత జాతీయ అభివృద్ధి సమ్మిళిత కూటమి (ఇండియా)ఆవిర్భావాన్ని చూసి బీజేపీ భయపడుతోందని పేర్కొన్నారు. కాషాయ దళం ప్రజల దృష్టిని దాని నుంచి మళ్లించడానికి ప్రయత్నిస్తోందని చక్రవర్తి పీటీఐకి తెలిపారు. బీజేపీ చర్య... భారత ప్రజాస్వామ్య సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని చెప్పారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనే అంశంపై కమిటీని ఏర్పాటు చేయాలనే మోదీ సర్కారు నిర్ణయం... దేశంలో ముందస్తు ఎన్నికలకు సంకేతంగా భావించవచ్చా అడిగిన ప్రశ్నకు చక్రవర్తి బదులిస్తూ... ఈ ఏడాది చివర్లో ఐదు రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరపాల్సి ఉన్నందున లోక్‌సభ ఎన్నికలను ముందుకు జరిపే అవకాశం లేదని చెప్పారు.

ఆగస్టులో జీఎస్‌టీ వసూళ్లు రూ.1.60 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: భారత వస్తు, సేవల పన్ను వసూళ్లు ఆగస్టులో వార్షిక ప్రాతిపదికన 11 శాతం పెరిగిద రూ.1.60 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గడచిన నెలల్లో మాదిరిగానే సంవత్సర వృద్ధికి సంబంధించి సంఖ్యలు దాదాపు 11 శాతం పరిధిలో ఉన్నాయని రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా శుక్రవారం తెలిపారు. సరుకులు, సేవల పన్ను (జీఎస్‌టీ) కింద 2022 ఆగస్టులో రూ.1,43,612 కోట్లు వసూలు అయ్యాయి. జూన్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.8 శాతంగా ఉందని, నామ మాత్రంగా 8 శాతం పెరిగిందని ఒక ప్రశ్నకు సమాధానంగా మల్హోత్రా చెప్పారు. జూన్ త్రైమాసికంలో జీఎస్‌టీ ఆదాయాలు 11 శాతం కంటే ఎక్కువ పెరిగాయి. ఇది జీడీపీ నిష్పత్తి 1.3 కంటే ఎక్కువ అని మల్హోత్రా పేర్కొన్నారు. జీఎస్‌టీ వసూళ్లు నామమాత్రపు జీడీపీ కంటే ఎక్కువగా పెరిగాయని, పన్ను రేట్లు పెరిగినప్పటికీ ఇది పెరిగిందని ఆయన అన్నారు. మెరుగైన సమ్మతి, మెరుగైన పన్ను వసూలు సామార్థ్యం దీనికి కారణం. జులైలో భారతదేశ వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు రూ.1.65 లక్షల కోట్లుగా ఉన్నాయి. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 11 శాతం వృద్ధిని నమోదు చేసింది. పండుగ సీజన్ ప్రారంభంతో గృహాలు, కార్లు, విహార యాత్రలు, ఇతర వినియోగ వస్తువల కోసం పెరిగిన వినియోగదారుల వ్యయం కూడా అధిక నెలవారీ జీఎస్‌టీ వసూళ్లను నిర్ధారిస్తుంది.

మారుతీ సుజుకీ రికార్డు విక్రయాలు

న్యూఢిల్లీ: దేశంలోని అతిపెద్ద వాహన తయారీ సంస్థ మారుతీ సుజుకి ఇండియా లిమిటెడ్ ఆగష్టులో అత్యధిక నెలవారీ విక్రయాలను నమోదు చేసినట్లు శుక్రవారం ప్రకటించింది. వాహనాల మొత్తం అమ్మకాలు ఆగష్టు 2023లో 14 శాతం వృద్ధి చెందాయి. గతేడాది ఇదే కాలంలో 1,65,173 యూనిట్ల వాహనాల విక్రయాలు జరగగా... ప్రస్తుతం 1,89,082 యూనిట్ల విక్రయాలు జరిగాయి. దేశీయ విపణిలో మొత్తం అమ్మకాలు గతేడాది ఆగష్టులో 1,43,692 యూనిట్ల నుంచి ఈ ఏడాది ఆగష్టులో 1,64,468 యూనిట్లుగా నమోదయ్యాయి. మొత్తం అమ్మకాలు కూడా ఆగష్టులో 14 శాతం పెరిగి 24,614 యూనిట్లకు చేరుకున్నాయి. ఆల్టో, ఎస్-ప్రెస్సోతో కూడిన మినీ సెగ్మెంట్ కార్ల అమ్మకాలు తగ్గాయి. బలెనో, సెలెరియో, డిజైర్, ఇగ్నిస్, స్విఫ్ట్‌లతో సహా కాంపాక్ట్ కార్ల పంపిణీ 71,557 యూనిట్లు విక్రయించబడ్డాయి.

ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-ఆగష్టు కాలంలో మహీంద్రా అండ్ మహీంద్రాను అధిగమించడం ద్వారా కంపెనీ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో అగ్రగామిగా అవతరించిందని మారుతీ సుజుకి ఇండియా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(మార్కెటింగ్-సెల్స్) శశాంక్ శ్రీవాస్తవ వెల్లడించారు. ఆగష్టులో మేము ఏప్రిల్-ఆగష్టు నుంచి సంచిత ప్రాతిపదికన ఎస్‌యూవీ విభాగంలో మొదటి స్థానంలో నిలచాం అని ఆయన పేర్కొన్నారు. ఆగష్టులో మారుతీ సుజుకీ ఎస్‌యూవీ విక్రయాలు 41,658 యూనిట్లుగా ఉండగా, మహీంద్రా అండ్ మహీంద్రా విక్రయాలు 37,233 యూనిట్లుగా ఉన్నాయిన శ్రీవాస్తవ తెలిపారు.

లాభాల బాటలో స్టాక్ మార్కెట్ సూచీలు

విశాలాంధ్ర బిజినెస్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సెప్టెంబరు నెల తొలిరోజే పరుగులు పెట్టింది. రెండు ప్రధాన సూచీలు భారీ లాభాలను నమోదు చేశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు సూచీలకు దన్నుగా నిలచాయి. దేశీయంగా జీఎస్‌టీ వసూళ్లలో పెరుగుదల, ఆటో విక్రయాల సూచీల్లో ఉత్సాహం, హుషారును నింపాయి. శుక్రవారం ఉదయం సెన్సెక్స్ 64,855.51 దగ్గర లాభాలతో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 65,818.37 మధ్య కదలాడింది. చివరకు 555.75 పాయింట్ల లాభంతో 65,387.16 దగ్గర స్థిరపడింది. నిఫ్టీ 19,258.15 దగ్గర ప్రారంభమై ఇంట్రాడేలో 19,458.55 - 19,255.70 మధ్య ట్రేడ్ అయింది. చివరకు 181.50 పాయింట్లు లాభపడి 19,435.30 దగ్గర ముగిసింది. మార్కెట్లు ముగిసే సమయానికి డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 82.71 దగ్గర నిలిచింది. లాభపడిన షేర్లు: జియో ఫైనాన్షియల్, ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్, మారుతీ సుజుకీ, పవర్ గ్రిడ్ కార్ప్, కోల్ ఇండియా, హిండాల్కో ఇండస్ట్రీస్, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, టెక్‌మహీంద్రా, ఎల్‌టీఐమైండ్‌ట్రీ, యూపీఎల్, విప్రో, ఐషర్ మోటార్స్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా మోటార్స్. నష్టపోయిన షేర్లు: సిప్లా, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అల్ట్రాటెక్ సిమెంట్స్, నెస్లే ఇండియా, సన్ ఫార్మా, దివీస్ ల్యాబ్స్, లార్సెన్ అండ్ టూబ్రో, హిందుస్థాన్ యూనీలివర్.

మోదీ సర్కారుతో దేశానికి ప్రమాదం

బస్సు యాత్ర నేటి షెడ్యూల్
కోడుమూరులో రైతు సదస్సు
ఆలూరు, పత్తికొండలో బహిరంగ సభలు

- టిడ్కో ఇళ్ల పంపిణీలో వైసీపీ ప్రభుత్వం విఫలం
- కర్నూలు బహిరంగసభలో రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో– కర్నూలు: మోదీ సర్కారు దేశానికి ప్రమాదకరంగా మారిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ విమర్శించారు. మళ్లీ మోదీ అధికారంలోకి వస్తే అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్నే సమూలంగా మారుస్తారని, లౌకిక రాజ్యాంగం అమలులో ఉండదని చెప్పారు. జగన్ ప్రభుత్వం కర్నూలులో హైకోర్టును పెడతానంటే ఎవరు వద్దన్నారో చెప్పాలన్నారు. సీపీఐ చేపట్టిన బస్సుయాత్ర శుక్రవారం కర్నూలుకు చేరుకుంది. ఈ సందర్భంగా కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు వద్ద నేతలకు ఘనస్వాగతం లభించింది. అనంతరం చెక్‌పోస్టు నుంచి పాతబస్టాండ్ బహిరంగ సభ వేదిక వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభకు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ... బస్సు యాత్ర సందర్భంగా ఎక్కడికి వెళ్లినా ప్రజలు తమ సమ్యలు ఏకరువు పెడుతున్నారన్నారు. కర్నూలులో పేదలు జానెడు స్థలం కోసం పోరాటం చేస్తున్నారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి 30లక్షల మందికి రాష్ట్రంలో ఇళ్ల స్థలాలు ఇచ్చామంటున్నారని... ఎవరికి ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. కర్నూలు నగరంలో 10వేల టిడ్కో, 8వేల ఇందిరమ్మ గృహాలునిర్మించి ఉన్నాయన్నారు. వాటిని పేదలకు పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలం చెంది ందని విమర్శించారు. మంత్రి బొత్స సత్యనారాయణ పేదలకు టిడ్కో ఇళ్లు పంపిణీ చేస్తామని అంటారే గానీ పంపిణీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెత్తందారులకు పేదల ప్రభుత్వానికి పోటీ అని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడం ఆశ్చర్యంగా ఉందని పేదల ప్రభుత్వం అయితే తాము గ్రామాల్లో మూడుసెంట్లు, పట్టణాల్లో రెండుసెంట్ల స్థలం పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తే ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం రిజర్వేషన్‌లు అమలు చేయకుండా మెడికల్ సీట్లు అమ్ముకుంటున్నారని విమర్శించారు. విద్యుత్‌చార్జీలు విపరీతంగా పెంచారని, చెత్తమీద కూడా పన్ను వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుస్టేషన్‌లను కూడా వైసీపీ కార్యాలయాలుగా మార్చారని, రాష్ట్రంలో దోపిడి దారులు, పోలీసు రాజ్యం నడుస్తోందని మండి పడ్డారు. మోదీ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి, కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ పాలన చేస్తున్నారని, ఇలాంటి ప్రధాని దేశానికి అవసరమా అని ప్రశ్నించారు. మోదీని గద్దెదించాలని, జగన్‌మోహన్‌రెడ్డిని సాగనంపాలనే నినాదంతో ముందుకు పోవాలన్నారు. ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్రప్రధాన కార్యదర్శి దుర్గాభవానీ మాట్లాడుతూ... ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని జగన్ సర్కారును సాగనంపాలని పిలుపు నిచ్చారు. సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు పీ రామచంద్రయ్య మాట్లాడుతూ... ఖరీఫ్ ముగుస్తున్నా నేటికి వర్షాలు లేక వేసిన పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతులు వలస పోయేందుకు సిద్ధమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం పెత్తందారీ విధానాన్ని పెంచి పోషిస్తోందని విమర్శించారు.

సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు మాట్లాడుతూ... చంద్రయాన్–3 విజయవంతానికి కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, సిబ్బందికి 17 నెలల జీతాలు ఇవ్వకుండా మోదీ ప్రభుత్వం చంద్రయాన్ సాధించిన దానికి శివశక్తి అని పేరు పెట్టుకోవడం దారుణమన్నారు. తొలుత సభలో ప్రజానాట్యమండలి కళాకారుల నృత్యప్రదర్శలు, గేయాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగ సభలో సీపీఐ రాష్ట్రసహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు కే రామాంజనేయులు, ఆవుల శేఖర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు, రాష్ట్ర అధ్యక్షులు పీ రాజేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు చంద్రనాయక్, పెంచలయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ఎన్ రసూల్, మునెప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్నాథం, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శులు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, మహేష్, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, షాబీర్‌బాష, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి గిడ్డమ్మ, పెద్దఎత్తున సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీమ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్
- నంద్యాలలో బస్సుయాత్రకు ఘన స్వాగతం

విశాలాంధ్ర– నంద్యాల: పెండింగ్ ప్రాజెక్టులు కూడా పూర్తి చేయలేని అసమర్థ ప్రభుత్వం జగన్ ప్రభుత్వమని, రాయలసీమ జిల్లాల్లోని ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని రక్షించండి... దేశాన్ని కాపాడండి అనే నినాదంతో ఆగస్టు 17 న విశాఖలో సీపీఐ ప్రారంభించిన బస్సు యాత్ర శుక్రవారం నంద్యాలకు చేరుకుంది. ఈ సందర్భంగా నూనెపల్లె వద్ద ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకుల అధ్వర్యాన భారీ మోటార్ సైకిల్ ర్యాలీతో బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికారు. స్థానిక పద్మావతి నగర్ నుంచి సీపీఐ శ్రేణులు పెద్ద సంఖ్యలో కదిలి వచ్చి ర్యాలీగా మున్సిపల్ టౌన్ హాల్ వద్దకు చేరుకున్నారు. టౌన్ హాల్ వద్ద సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఓబులేసు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామాంజనేయులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తులసి రెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి తదితరులకు నంద్యాల జిల్లా సీపీఐ తరపున ఘన స్వాగతం పలికారు. వారికి పూల మాలలు వేసి, హారతులు పట్టి వేదిక వద్దకు తోడ్కొని వెళ్లారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో రామకృష్ణ మాట్లాడుతూ... ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి గ్రామానికి తాగు నీటిని సాధించేందుకు బస్సు యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో పర్యటించి, ప్రస్తుతం రాయలసీమ జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. జగన్ అధికారంలోకి వచ్చాక సాగునీటి ప్రాజెక్టులపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని, పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు ఇవ్వకుండా ఎత్తు తగ్గించాలని చూస్తోందని, దీనివల్ల మన రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిర్మిస్తేనే గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం జరుగుతుందని, అప్పుడే శ్రీశైలం ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు నీళ్లు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఉత్తరాంధ్ర, సుజల స్రవంతి ప్రాజెక్టులకు నీళ్లు రావాలంటే పోలవరం పూర్తి కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. 960 మెగా వాట్ల ఉత్పత్తి జరగాలంటే కూడా పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తుంటే ప్రధాని మోదీతో జగన్ ఎందుకు మాట్లాడలేకపోతున్నారని నిలదీశారు. రాష్ట్ర ప్రయోజనాలను ఆయన సొంత అవసరాలకు కేంద్రం వద్ద తాకట్టు పెడుతున్నారని, ఇటువంటి చేతకాని సీఎం మనకు అవసరమా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా జగన్ ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తి చేసి రాయలసీమ ప్రాంతానికి తాగునీరు, సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే రామాంజనేయులు మాట్లాడుతూ... సీఎం జగన్ నాలుగున్నరేళ్లలో రాయల సీమలో ఒక సాగునీటి ప్రాజెక్టు కూడా పూర్తిచేసి అదనంగా ఒక ఎకరా ఆయ కట్టుకు కూడా నీరు అందించలేకపోయారన్నారు. రాయలసీమకు ఆది నుంచి అన్యాయం జరుగుతోందన్నారు. పెద్ద మనుషుల ఒప్పందం అమలుకు నోచుకోలేదని, 1953లో కర్నూలులో ఏర్పాటయిన రాష్ట్ర రాజధాని 1956లో హైదరాబాద్ కు మార్చారని, బళ్లారిని కర్నాటకలో కలపడం వల్ల తుంగభద్ర జలాశయాన్ని కోల్పోయామన్నారు. బచావత్ ట్రిబ్యునల్ వల్ల నికర జలాలు కొల్పోయామని, బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ వల్ల మిగులు జలాలు కూడా కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.తులసి రెడ్డి మాట్లాడుతూ... సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితేనే సీమ వెనుకబాటుతనం పోతుందన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో బడ్జెట్‌లో 10 నుంచి 17% సాగునీటి రంగానికి నిధులు కేటాయిస్తుంటే, గత టీడీపీ ప్రభుత్వం తొమ్మిది శాతం మాత్రమే కేటాయించిందని, జగన్ ప్రభుత్వం కేవలం ఐదు శాతం మాత్రమే నిధులు కేటాయించిందన్నారు. గత నాలుగున్నర ఏళ్లలో కేవలం రూ.19 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని చెప్పారు. కనీసం గేట్ల మరమ్మతులు కూడా చేసుకోలేని దుస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. రాయలసీమ సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ... రాయలసీమలో ఏ ప్రాజెక్టుకు ఎంత నీటి కేటాయింపులు ఉన్నాయి... ఏ ప్రాజెక్టు కింద ఎంత విస్తీర్ణంలో సాగు జరుగుతుందో వివరించారు. 305 జీవో తెచ్చి ప్రాజెక్టులకు మరమ్మత్తులు చేయకుండా పనులు నిలిపేశారన్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నుండి ఎంత నీరు వృథాగా పోయిందో ఆయన లెక్కలు వేసి మరీ వివరించారు. తాము రైతుల కోసం కలిసి వచ్చే పార్టీలతో ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ మాట్లాడుతూ... చంద్రబాబు, జగన్ ఇద్దరికీ దోచుకోవడం, దాచుకోవడమే పని అని ఆరోపించారు. బస్సు యాత్ర ద్వారా సీపీఐ ప్రజా సమస్యలపై ఉద్యమించడాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. రాయలసీమలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ అధిక రేట్లకు అమ్ముకోవడం ద్వారా రూ.11 లక్షల కోట్లు దోపిడీ చేసిందన్నారు. 450 రూపాయలున్న సిలిండర్ ను 1200 రూపాయలకు పెంచి ఇప్పుడు 200 రూపాయల తగ్గించినట్లు మోదీ మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ఇది కేవలం ఎన్నికల జిమ్మిక్కుని, ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఇటువంటి చర్యలు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.

ఈ సదస్సులో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పర్చూరి రాజేంద్ర, నక్కిలెనిన్ బాబు, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రనాయక్, పెంచలయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ రఘురాంమూర్తి, మోట రాముడు, పట్టణ కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శి సోమన్న, నాయకులు సుబ్బరాయుడు, శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, ధనుంజయుడు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రణత్ యాదవ్, నాగరాముడు, ఉపాధ్యక్షుడు సురేశ్‌తో పాటు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రాజెక్టులపై చిత్తశుద్ధి లేదు: ఓబులేసు

సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు మాట్లాడుతూ... పాలకుల నిర్లక్ష్యం వల్లనే రాయలసీమలో కరువు తాండవిస్తోందన్నారు. రాజకీయ పార్టీలు, నాయకులు కేవలం ఎన్నికల కోసం, ఓట్ల కోసం ప్రజలను మభ్యపెడుతున్నారని, చిత్తశుద్ధితో ప్రాజెక్టుల పూర్తికి పనిచేయడం లేదన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి కోటి ఎకరాలకు నీళ్లు ఇస్తామని, రూ.లక్ష కోట్లు ఖర్చు పెడతానని చెప్పారని, ప్రాధాన్యతా క్రమంలో రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఆనాడు ఆయన్ను కోరినా కూడా పట్టించు కోలేదన్నారు. కేవలం పోలవరం ఎడమకాల్వ నిర్మించినంత మాత్రాన నీళ్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కాకుండానే కాలువ నిర్మించారని విమర్శించారు. గత పాలకులు గానీ ప్రస్తుత పాలకులు గానీ సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోవడం లేదన్నారు.

నీటివనరుల వినియోగంపై నిర్లక్ష్యం: ముప్పాళ్ల

సీపీఐ సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ... రాయలసీమ ప్రాంత ప్రాజెక్టులపై శివరామకృష్ణ కమిషన్ గతంలోనే అధ్యయనం చేసి...ప్రాజెక్టులు నిర్మించాలని తెలిపిందన్నారు. కేవలం కోటి, రెండు కోట్ల రూపాయలతో ప్రాజెక్టులను రిపేర్లు చేయవచ్చని, అయినా జగన్ ప్రభుత్వం వాటిని మూలన పడేసిందన్నారు. రూ.83 లక్షలు ఖర్చు చేస్తే అలగనూరు రిజర్వాయర్ పూర్తవుతుందని...అయినా పట్టించుకోలేదన్నారు. నంద్యాల జిల్లా రాయలసీమ నీటి ప్రాజెక్టులకు ముఖ ద్వారమని, జిల్లాలో నీటి వనరులను సద్వినియోగం చేసుకోవడానికి అవకాశం ఉన్నా. పాలకులు ఆ దిశగా ఆలోచించడం లేదన్నారు.ఏపీలో సమగ్ర నీటి వినియోగ ప్రణాళిక రూపొందించి పక్క రాష్ట్రాలు ఎలా చేస్తున్నాయో అధ్యయనం చేయాల్సిన అవసరం, ఆవశ్యకత ఉందన్నారు. నీటి కోసం ప్రత్యక్ష పోరాటాలకు సమాయత్తం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

‘ఒక దేశం, ఒకే ఎన్నిక’ వద్దు

- ఈ విధానానికి సీపీఐ వ్యతిరేకం
- ఎరువుల బస్తాలపై ‘పీఎం–బీజేపీ’ లోగో తగదు
- రాజకీయ ప్రచారానికి ప్రజాధనం దుర్వినియోగం
- నారాయణ, వినయ్ విశ్వం

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తున్న ఒక దేశం, ఒకే ఎన్నిక, ఒకటే ఎరువుల విధానాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వ్యతిరేకించింది. పన్ను చెల్లింపుదారుల డబ్బుతో రాజకీయంగా ప్రచారం చేసుకోవాలని బీజేపీ భావిస్తోందని దుయ్యబట్టింది. ‘పీఎం–బీజేపీ’ అన్న బ్రాండ్ ఎరువులు మాత్రమే రైతులు కొనే విధంగా చర్యలు చేపట్టడం ఆక్షేపణీయమని పేర్కొంది. ఎరువుల బస్తాలపై ప్రధాని ఫొటో ఉండటాన్ని సీపీఐ కార్యదర్శులు కె.నారాయణ, వినయ్ విశ్వం వ్యతిరేకించారు. ప్రైవేటు, ప్రభుత్వ ఎరువుల కంపెనీలు అనేక సంవత్సరాలుగా ఉన్నాయని, వాటికున్న గుర్తింపును రద్దు చేసి, 2024 ఎన్నికల వేళ రాజకీయ ప్రచారం దృష్ట్యా ‘పీఎం–బీజేపీ’ ప్రచారానికి మోదీ ప్రభుత్వం, బీజేపీ యత్నిస్తున్నట్లుగా తాజా చర్యలు ఉన్నాయని విమర్శించారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నిర్వహణ ఒకదేశం, ఒక ఎన్నిక ఆచరణ కోసమే అని తెలిసిందని నారాయణ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించే రాజకీయాలు చేయడంలో ప్రధాని మోదీ దిట్ట అని వ్యాఖ్యానించారు. ఒక దేశం, ఒక పార్టీ, ఒక వ్యక్తి అన్నది ఆర్ఎస్ఎస్ వైఖరిగా తెలిపారు. ఒక దేశం–ఒక ఎన్నికలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాల్సి ఉందన్నారు. ఈ విధానానికి సీపీఐ పూర్తిగా విరుద్ధమని నారాయణ స్పష్టంచేశారు. ఇష్టమొచ్చినట్లు రాజ్యాంగాన్ని వినియోగించాలని భావించడం తగదన్నారు. ఏదేని ప్రక్రియ ప్రజాస్వామ్యబద్ధంగానే జరగాలని నొక్కిచెప్పారు. ఎన్నికలపై చర్చించకుండా ఏకపక్షంగా ముందుకెళ్లాలని భావిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇండియా కూటమి బలం పుంజుకోకముందే దానిని బలహీనపర్చాలని బీజేపీ భావిస్తోందని నారాయణ అన్నారు. ఎంపీ వినయ్ విశ్వం కూడా ఒక దేశం, ఒక ఎన్నిక, ఒక ఎరువుల విధానాన్ని దుయ్యబట్టారు. ప్రధానికి రాసిన లేఖలో పీఎం–బీజేపీ బ్రాండింగ్, ప్రింటింగ్, ఎరువులపై ప్రధాని ఫొటో ఉండటాన్ని ప్రశ్నించారు. ఈ విధానంలో ఎరువుల ఎంపికలో స్పష్టత, పారదర్శకత రైతులకు ఉండదన్నారు. అన్ని ఎరువులను ఒకే బ్రాండ్ కిందకు తేవడం వెనుక రాజకీయ ఉద్దేశం అన్న అనుమానం వస్తోందని తెలిపారు. ‘ఈ రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు ఎరువుల కంపెనీలు ఉన్నాయి. అన్ని ఎరువులకు ఒకటే పేరును ఆపాదించడమంటే మిగతా కంపెనీలకు గుర్తింపు లేకుండా చేయడమే అవుతుంది. నచ్చిన ఉత్పత్తులను వినియోగించే హక్కు రైతులకు లేకుండా పోతుంది. దీంతో వాళ్లు గందరగోళానికి గురికావచ్చు. ఎరువుల బస్తాలపై ‘పీఎం–బీజేపీ’ ముద్రణ అనుమానం కలిగిస్తోంది. బీజేపీ అన్న పేరు, లోగో... భారతీయ జనతా పార్టీ పేరును సూచిస్తుండటంతో రాజకీయ బ్రాండింగ్‌కు కసరత్తు జరుగుతుందన్న అనుమానం వస్తుంది. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికలకు ముందు ఇలాంటి చర్యలు అనేక ప్రశ్నలకు తావిస్తున్నాయి’ అని వినయ్ విశ్వం పేర్కొన్నారు. ‘పీఎం–బీజేపీ’ వాడకం రాజకీయ ప్రేరేపితమని స్పష్టమవుతోందని, పరిపాలన నిష్పాక్షికతపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుందని లేఖలో ప్రధానికి సూచించారు. రాజకీయ ప్రచారం కోసం పన్ను చెల్లింపుదారుల ధనాన్ని దుర్వినియోగిస్తున్నారన్న ఆరోపణ రాకమానదని, ఒక దేశం –ఒకటే ఎరువులు విధానంపై పునరాలోచన అవశ్యమని నొక్కిచెప్పారు. ఎరువుల కంపెనీల గుర్తింపును, వినియోగదారుల్లో వాటిపై ఉన్న నమ్మకాన్ని అలాగే ఉండనివ్వాలని మోదీని వినయ్ విశ్వం కోరారు. తమ విజ్ఞప్తి ప్రధాని సానుకూలంగా స్పందిస్తారని ఆకాంక్షించారు.

8న తిరుపతిలో జరిగే

భారీ ర్యాలీ, బహిరంగ సభ జయప్రదం చేయండి

- పార్టీ శ్రేణులకు రామకృష్ణ దిశానిర్దేశం
- 9న రాష్ట్ర సమితి సమావేశం

విశాలాంధ్ర–విజయవాడ: ‘దేశాన్ని కాపాడుకుందాం– రాష్ట్రాన్ని రక్షించుకుందాం’ అనే లక్ష్యంతో సీపీఐ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బస్సుయాత్ర విజయవంతంగా కొనసాగుతోందని, యాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 8వ తేదీన తిరుపతిలో నిర్వహించే భారీ ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయటానికి పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గం, జిల్లాల కార్యవర్గ సభ్యులతో రామకృష్ణ శుక్రవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పటి వరకు అనేక జిల్లాల్లో ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. తిరుపతిలో జరిగే ర్యాలీ, బహిరంగ సభల్లో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. పార్టీ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని సభను జయప్రదం చేయటానికి కృషి చేయాలని కోరారు. ఆయా జిల్లాల్లో పార్టీ నాయకత్వం కష్టపడి పని చేసిందని చెప్పారు. అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో బస్సుయాత్ర కొనసాగనుందన్నారు. బస్సుయాత్ర చేపట్టిన లక్ష్యం నెరవేరిందన్నారు. బస్సు యాత్ర 24 రోజుల పాటు 26 జిల్లాల్లో పర్యటించినట్లు తెలిపారు. బస్సుయాత్ర సందర్భంగా జిల్లాల్లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశాలు, సదస్సులలో ఇతర రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. తద్వారా బస్సుయాత్రకు విస్తృత ప్రచారం లభించిందని వివరించారు. ప్రధాన వార్త పత్రికల్లో కవరేజ్ బాగా వచ్చిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు యాత్రలు చేస్తున్నారు, పవన్ కల్యాణ్ వారాహి యాత్ర, లోకేశ్ యువగళం పాదయాత్ర చేస్తున్నారు. దీంతో కమ్యూనిస్టు పార్టీ వెనుకబడిపోతుందనే భావం నెలకొందని, బస్సుయాత్ర విజయవంతంగా కొనసాగటంతో రాజకీయ ప్రాధాన్యత పెరిగిందన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని మాత్రమే విమర్శిస్తున్నాయని, మోదీ పాలనపై మాట్లాడే ధైర్యం ఆయా పార్టీలకు లేదన్నారు. సీపీఐ కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డిలను గద్దె దించాలనే లక్ష్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల ముందుకు తీసుకెళ్లగలిగామన్నారు. 8న జరిగే బహిరంగ సభకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్న తిరుపతి కార్యవర్గాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం జిల్లాల వారీగా సమీక్ష చేశారు. జిల్లా నాయకులు వారివారి జిల్లాల్లో బస్సుయాత్ర జరిగిన తీరు, జరగబోయే జిల్లాల నాయకులు చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. దేశంలో ఎన్నికల వేడి ప్రారంభమైందని, రాజకీయాలు వేగంగా మారుతున్నాయన్నారు. ఒకవేళ జమిలి ఎన్నికలు జరిగితే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కూడా ఎన్నికలను ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ చాలా బలంగా ఉందనే సంకేతాలు వెళ్లాయన్నారు. తిరుపతిలో జరిగే భారీ ర్యాలీ, బహిరంగ సభలకు భారీగా జనసమీకరణ చేయాలని కోరారు. 9వ తేదీన రాష్ట్ర సమితి సమావేశం తిరుపతిలో జరుగుతుందని, పార్టీ నాయకత్వం దానికి అనుగుణంగా తిరుపతి చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, జి.ఓబులేసు, పి.హరినాథరెడ్డి, డి.జగదీశ్, దేగా ప్రభాకర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.